కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో...
వీక్షించండి చానల్
NS99
CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని
తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :134 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శుక్రవారం 11-09-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

## ఫ్యూచర్‌సిటీ నిలవదు,చెల్లదు : కేటీఆర్

రంగారెడ్డి జిల్లా,ఫోర్త్ సిటీ భూముల కేటాయింపు వ్యవహారం తెలంగాణలో రాజకీయ వేడిని మరింత పెంచింది. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ పరిధిలోని టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ వద్ద బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ధర్నాకు దిగారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో బీఆర్‌ఎస్ నేతలు ఆందోళన చేపట్టారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డితో సంబంధం ఉందని బీఆర్‌ఎస్ చెబుతున్న టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు రావిర్యాల ప్రాంతంలో ప్రభుత్వ భూమి కేటాయింపుపై ఆ పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భూమి కేటాయింపులో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ప్లకార్డులు ప్రదర్శించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రూ.200 కోట్ల భూమి.. రూ.7 కోట్లకేనా?

టెస్సెరాక్ట్‌కు సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని రూ.7 కోట్లకు కేటాయించారని, ఆ భూమి విలువ సుమారు రూ.200 కోట్ల వరకు ఉంటుందని కేటీఆర్ గతంలో ఆరోపించారు. ఈ కేటాయింపుపై సమగ్ర విచారణ జరపాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తోంది. కంపెనీ ఆర్థిక సామర్థ్యం, చెల్లించిన మూలధనం, ఉద్యోగుల వివరాలు, భూమి కేటాయింపు విధానం తదితర అంశాలపై కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. అయితే భూమి వాస్తవ విలువ, కేటాయింపు నిబంధనలు, సంస్థ అర్హతలపై తుది స్పష్టత అధికారిక ప్రభుత్వ రికార్డులు, కేటాయింపు ఉత్తర్వులతోనే వస్తుంది.

'ఫ్యూచర్ సిటీ భవిష్యత్తులో ఉండదు'

ధర్నా అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ 'ఫ్యూచర్ సిటీ' పేరుతో ప్రభుత్వం చేస్తున్న ప్రచారంపై తీవ్ర విమర్శలు చేశారు. గతంలో ఫార్మా సిటీ కోసం షరతులతో భూసేకరణ జరిగిందని, ఆ భూములను ఇతర ప్రయోజనాలకు వినియోగిస్తే భవిష్యత్తులో సమస్యలు తలెత్తుతాయని ఆయన వాదించారు. "ఫ్యూచర్ సిటీ మాయ. భవిష్యత్తులో ఇది చెల్లదు" అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన కుటుంబ సభ్యుల ప్రయోజనాల కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

పెట్టుబడిదారులకు కేటీఆర్ హెచ్చరిక

ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే సంస్థలు, వ్యక్తులు జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్ సూచించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో



జరుగుతున్న భూ లావాదేవీలు, రియల్ ఎస్టేట్ కార్యకలాపాలపై బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సమీక్ష ఉంటుందని హెచ్చరించారు. "రేపు మా ప్రభుత్వం వస్తే నష్టపోయేది పెట్టుబడిదారులే" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఫ్యూచర్ సిటీపై రంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు వివరించేలా సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

కుటుంబ ప్రయోజనాలపై ఆరోపణలు

అమెరికా పర్యటన సందర్భంగా పెట్టుబడుల పేరుతో ముఖ్యమంత్రి తన కుటుంబ సభ్యులతోనే ఒప్పందాలు చేసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. కొండల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డికి సంబంధించిన పెట్టుబడులు, ప్రాజెక్టులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో ఈ వ్యవహారంపై బీజేపీ వైఖరిని కూడా కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న బీజేపీ.. భూ కేటాయింపుల అంశంలో ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

'ప్రజాకోర్టుకు వచ్చాం'

"ఈరోజు ప్రజాకోర్టుకు వచ్చాం.. రేపు ఊరూరా చెబుతాం" అని కేటీఆర్ అన్నారు. భూ కేటాయింపుల వ్యవహారంలో వాస్తవాలను మీడియా వెలుగులోకి తీసుకురావాలని కోరారు. శాసనసభలో ఈ అంశాన్ని ప్రశ్నిస్తామనే కారణంతో తమను సస్పెండ్ చేశారని ఆయన ఆరోపించారు. ఇదిలా ఉండగా, టెస్సెరాక్ట్ భూ కేటాయింపుపై బీఆర్‌ఎస్ గతంలోనే సమగ్ర దర్యాప్తు కోరింది. ఈ అంశం అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వివాదంగా కొనసాగుతోంది.

## తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు బంపర్ ఆఫర్.. రూ. కోటి ఉచిత బీమా..



హైదరాబాద్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్ల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ప్రమాద బీమా పథకంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శాసనసభలో కీలక ప్రకటన చేశారు. ప్రమాదవశాత్తూ ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే మానవీయ ఉద్దేశంతో దేశంలోనే తొలిసారిగా రూ.కోటి ఉచిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వంపై కానీ, ఉద్యోగులపై కానీ పైసా భారం పడకుండా బ్యాంకర్ల భాగస్వామ్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని వెల్లడించారు.

12.91 లక్షల మందికి లబ్ధి.. క్రమం తప్పకుండా చెల్లింపులు పూర్తి: ఈ ప్రమాద బీమా పథకంద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12,91,056 మంది ఉద్యోగ, పెన్షనర్ వర్గాలకు భరోసా లభిస్తోందని భట్టి వివరించారు. వీరిలో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 5,00,158 మంది తాత్కాలిక, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సెర్ప్ సిబ్బంది, 2,72,600 మంది పెన్షనర్లు ఉన్నారు. ఈ పథకం కింద ఇప్పటివరకు వచ్చిన 98 క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరించి బాధితుల కుటుంబాలకు కోట్ల రూపాయల పరిహారాన్ని నేరుగా అందించినట్లు శాసనసభ వేదికగా తెలిపారు.

ఉచిత బీమాతో పాటు ప్రత్యేక హెల్త్‌కార్డులు.. భట్టి విక్రమార్క వెల్లడి: ప్రమాద బీమా సౌకర్యంతో పాటు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అందుకోసం కార్పొరేట్ తరహా వైద్యం అందించేలా ప్రత్యేక హెల్త్‌కార్డులను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటూ, సిబ్బంది సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ నిర్ణయాలను వేగంగా అమలు చేస్తోందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## సభాపతిని అవమానించిన వారిని చట్టపరంగా శిక్షిస్తాం

హైదరాబాద్:కాంగ్రెస్ పార్టీ అంటే దేశంలో కోట్లాది ప్రజలకు ఒక నమ్మకం, ఒక భరోసా. కాంగ్రెస్ ఏం చేసిందని అడిగేవారు? పాకిస్తాన్, బంగ్లాదేశ్ లను ఒకసారి పరిశీలించాలి. కాంగ్రెస్ దూరదృష్టితో ఏ రకంగా ఈ దేశం అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుందో అర్థమవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.బుధవారం అయన శాసనసభలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో రిజర్వేషన్లను కల్పించింది కాంగ్రెస్ పార్టీ. ఇది కాంగ్రెస్ పార్టీ విధానం. కర్ణాటకలో ఒక చిన్న గ్రామంలో పుట్టి, రజాకార్ల దాడులలో తండ్రిని కోల్పోయి కార్మిక నాయకుడిగా రాణించి.. జాతీయ స్థాయికి ఎదిగిన నేత మల్లికార్జున ఖర్గే . 60 ఏళ్లుగా ఒకరోజు కూడా విరామం లేకుండా ఆయన ప్రజలకోసం పనిచేస్తున్నారు. ఉత్తరాఖండ్ లో ఒక మైదానంలో జరిగిన సభలో మల్లికార్జున ఖర్గే పాల్గొంటే. ఆగస్టు 10 న బీజేపీ అనుబంధ సంస్థ ఆ మైదానంలో శుద్ధీకరణ కార్యక్రమం చేపట్టడం హేయమైన చర్య అని అన్నారు.దీన్ని ఈ సభ ముక్తకంఠంతో ఖండిస్తోంది. ఈ ఘటనపై ఖర్గే రాజ్యసభలో భావోద్వేగంతో ప్రధానిని అడిగి కడిగి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు . పార్లమెంట్ సభ్యులు రాష్ట్రపతిని కలిసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు . ఇదిలా ఉండగానే మరో దురదృష్టకర సంఘటన జరిగింది. విద్యా రంగంలో అక్రమాలు, ధరణి అక్రమాలు, 22 ఏ రాద్ధాంతంపై సభలో చర్చించాలని అనుకున్నాం. కానీ ఫామ్ హౌస్ లో కుట్ర చేసి తమ సభ్యులను సభను అడ్డుకునేందుకు ఉసిగొల్పారు. సమస్యలపై చర్చ జరిగితే వారి పదేళ్ల దురాగతాలు, అప్పులపై ప్రజలకు అవగాహన కలుగుతుందని భయపడ్డారు. అదే జరిగితే తెలంగాణ ప్రజలు ఇక శాశ్వతంగా వారి పార్టీని బొందపెడతారని చర్చ జరగకుండా కుట్ర చేశారని అన్నారు. పార్లమెంట్ పై దాడి చేసిన వాళ్లకు, ముంబై దాడులకు పాల్పడిన కసబ్ కు, పుల్వామాలో సైనికులపై దాడిచేసిన తీవ్రవాదులకు, ఉన్మాదంతో సభాపతిని అవమానించిన వారికి పెద్ద తేడా లేదు . ఉన్మాదానికి లోనై ఉసిగొల్పబడిన కొంతమంది ముష్కరులు అధికారులపై దాడులు చేయడమే కాకుండా సభాపతి కుర్చీని అవమానించేలా వ్యవహరించారు. వ్యక్తినే కాకుండా తల్లిని కూడా అవమానించారు. మహిళలను శక్తిగా కొలిచే సమాజం మనది. భారత దేశాన్ని



భారత మాత అని, తెలంగాణ రాష్ట్రాన్ని తెలంగాణ తల్లిగా భావిస్తున్నాం. సభాపతిగా ఉన్న మీ మనసుకు గాయం చేయాలని ఉన్మాదంతో మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుడు కెసీఆర్ సభాపతికి క్షమాపణ చెప్పి వారి సభ్యులతో క్షమాపణ చెప్పించి సభ సజావుగా జరిగేలా చూస్తారని అంతా భావించారు. కానీ అలా జరగకపోగా మరింత ఉన్మాదంతో వ్యవహరించారు. అందుకే? ఏ ఫామ్ హౌస్ లో కుట్ర జరిగిందో ఆ ఫామ్ హౌస్ ముందు దండోరా వేయాలని ప్రజాస్వామ్యవాదులు నిరసనకు దిగారు. వాళ్లలా ఉన్మాదానికి తెగబడలేదు.. కేవలం డప్పు దరువులతో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపారు. దళిత సోదరులు తమ మనసులో భావాన్ని వ్యక్తం చేసేందుకు డప్పును ఒక సాధనంగా ఉపయోగిస్తారు. మిమ్మల్ని అవమానించినట్లుగా కేసీఆర్ ఫామ్ హౌస్ వద్ద వారిని అవమానించలేదు.. దూషించలేదని అన్నారు.మమ్మల్ని బానిసలుగా భావించవద్దని.. సహనాన్ని కోల్పోయేలా వ్యవహరించవద్దని మేల్కొలిపేందుకు అక్కడికి వెళ్లారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు లేదా? ప్రతిపక్ష నాయకుడిగా బాధలో ఉన్నవారి సమస్యను పరిష్కరించే బాధ్యత వారిపై ఉంది. ఆ ప్రతినిధులను లోపలికి పిలిచి మాట్లాడి జరిగిన సంఘటనపై కెసీఆర్ బాధ్యతతో వ్యవహరించాల్సి ఉండే. కానీ అలా వ్యవహరించకుండా మళ్లీ ఉన్మాదంతో వ్యవహరించారు. దళితులు తిరిగిన నేలను శుద్ధి చేయాలని ఆదేశించి తీవ్రంగా అవమానించారు. అసలు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. రాతి

## రెండో విడతలో రాష్ట్రంలోని 59 వేల గుడిసెదారులకు ఇళ్లు: పొంగులేటి



హైదరాబాద్: రెండు విడతల్లో ప్రభుత్వం నిధులు మంజూరు చేయాల్సి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మూడు, నాలుగో విడతలోనూ అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వాలని యోచనలో ఉందని అన్నారు. 4వ రోజు తెలంగాణ అసెంబ్లీ శాసనసభ సమావేశాలలో పొంగులేటి ప్రసంగించారు. దాదాపు 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల చెల్లించాల్సి ఉందని, చిన్న లోపాలతో నిర్మాణ దశలో ఉన్న 3200 ఇళ్లకు వారంలో నిధులు సమకూరుస్తున్నామని తెలియజేశారు. గతంలో పింక్ చొక్కా వేసుకున్న వారికే ఇళ్లు కేటాయించారని, బిఆర్ఎస్ శ్రేణులకూ ప్రాధాన్యం ఇచ్చి అర్హులకు ఇళ్లు కేటాయిస్తామని చెప్పారు. సమస్యలపై ప్రతిపక్ష సభ్యులు తన దృష్టికి తెచ్చినా పరిష్కరిస్తున్నామని, గతంలో పేదలకు లేఅవుట్ వేసి పెండింగ్ లో ఉన్నవి నెలలోపు కేటాయిస్తామని చెప్పారు. ఇళ్లు నిర్మించే పేదలకు రూ. 230కే సిమెంట్ బస్తా ఇచ్చేలా ఎంవొయూ ఉందని, రాబోయే రోజుల్లో స్టీల్ విషయంలోనూ ఇదే విధానం అనుసరిస్తామని అన్నారు. రెండో విడతలో రాష్ట్రంలోని 59 వేల గుడిసెదారులకు ఇళ్లు, క్యూర్ పరిధిలో ఏడాదిలోపు ఇందిరమ్మ టవర్స్ లో ఇళ్లు కేటాయిస్తామని, గతంలో పెండింగ్ లో ఉన్న 2 పడకల ఇళ్లకు రూ. 600 కోట్లు కేటాయించామని అన్నారు. అసంపూర్ణంగా ఉన్న 2 పడకల ఇళ్ల బిల్లులు రూ. 750 కోట్లు విడుదల చేశామని, డ్వాక్రా సంఘంలో సభ్యులకు ఇళ్ల నిర్మాణానికి రూ. లక్ష అడ్వాన్స్ ఇస్తామని పొంగులేటి హామీ ఇచ్చారు.

## శాసనమండలి నుంచి బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్




హైదరాబాద్,శాసనమండలినుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. సభ జరుగుతున్న తీరుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నారు.22ఏ నిషేధిత భూములకు సంబంధించిన సమస్యలపై వెంటనే చర్చ జరపాలని బీఆర్ఎస్ సభ్యులు వాయిదా తీర్మానం ప్రతిపాదించారు.మండలి చైర్మన్ ఈ ప్రతిపాదనను తిరస్కరించారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసు దనాచారి మండలిలో మార్షల్స్ ప్రవర్తను తీవ్రంగా తప్పు పట్టారు. మార్షల్స్ ద్వారా సభ్యుల గౌరవానికి భంగం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. శాసన మండలిలో బీఆర్ఎస్ గొంతు నొక్కేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ సస్పెన్షన్స్, మైక్ ఇవ్వక పోవడం వంటి అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడుతున్నది.

## ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించం



హైదరాబాద్:శాసనసభలో ఆర్టీసీ పై పలువురు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిచ్చారు. మంత్రి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు రైల్వేలు దేశవ్యాప్తంగా లైఫ్లైన్ అయితే.. తెలంగాణ ప్రజలకు ఆర్టీసీ లైఫ్లైన్. ప్రతిరోజూ సుమారు 30 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరుగుతూ, 65 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. గత ప్రభుత్వం పదేళ్లలో ఆర్టీసీని నిర్లక్ష్యం చేసి సంస్థను నిర్వీర్యం చేశారని అన్నారు.రిటైర్డ్ ఈడీని ఎండీగా నియమించి సంస్థ నిర్వహణను బలహీనపరిచారు. కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా ఆర్టీసీని నష్టాల బాటలోకి నెట్టారు. కార్మికుల సమస్యలను కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. 2023 డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. డిసెంబర్ 9న మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ఇది మహిళల ఆర్థిక భారం తగ్గించడంతో పాటు ఆర్టీసీకి కూడా కొత్త ఊపునిచ్చింది. మహాలక్ష్మి పథకం తర్వాత ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ గణనీయంగా పెరిగిందని అన్నారు. బస్ స్టేషన్లు, బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. ఇప్పటివంకు 347.47 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి, రూ.12,171 కోట్లు ఆదా చేసుకున్నారు.




## వరంగల్-హైదరాబాద్ హైవే.. వచ్చే జూన్ నాటికి పూర్తి : మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్,రాష్ట్రంలో రవాణా రంగానికి మహర్దశ పట్టే శుభవార్త ఇది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వరంగల్ – హైదరాబాద్ జాతీయ రహదారి నిర్మాణం తుది దశకు చేరుకుంది. శాసనమండలిలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టమైన ప్రకటన చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి నేషనల్ హైవేస్ రీజినల్ ఆఫీసర్ , చీఫ్ ఇంజనీర్ అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు.గతంలో నిలిచిపోయిన పనులకు జీవం పోస్తూ, ప్రస్తుతం కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆలస్యం లేకుండా క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఎక్కడా నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, నిర్దేశిత లక్ష్యం ప్రకారం వచ్చే ఏడాది జూన్ నాటికి పనులన్నీ పూర్తి చేసి ఈ ప్రతిష్టాత్మక రహదారిని ప్రజల ప్రయాణానికి అందుబాటులోకి తెస్తామని ధైర్యంగా ప్రకటించారు.ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారుల కష్టాలకు త్వరలోనే పూర్తి తెరపడనుంది. నాలుగు లైన్ల విస్తరణ పనులు వేగవంతం



కావడంతో, ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులకు రాజధాని నగరంతో అనుసంధానం మరింత సులభం కానుంది. నాణ్యతా ప్రమ్ణ?యాలతో కూడిన ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

## సంపాదకీయం

**శుక్రవారం 11-09-2026**

# వ్యవసాయానికి డేంజర్ బెల్స్...

దేశం మొత్తం మీదా వర్షం పరిస్థితి ఆశాజనకంగా లేదు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంగా దేశంలో సుమారు 870 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ సెప్టెంబర్ మొదటి వారం నాటికి సీజనల్ వర్షపాతం సాధారణం కంటే 13 శాతం తక్కువగా ఉంది. జూన్‌లో ఏకంగా 35 శాతం లోటు నమోదైంది. జులైలో కొంత వర్షం పుంజుకున్నా.. ఆగస్టులో మళ్లీ 16 శాతం లోటు వచ్చింది. ప్రాంతాల వారీగా చూస్తే దక్షిణ ద్వీపకల్పంలో దాదాపు 27 శాతం వర్ష లోటు ఉంది. అంటే తెలంగాణ, ఏపీ సహా దక్షిణాది ప్రాంతాలపై వర్షాభావ ప్రభావం ఎక్కువగా ఉంది. సెప్టెంబర్‌లోనూ సాధారణం కంటే తక్కువ వర్షాలు పడే అవకాశం ఉందటంతో.. ఈసారి నైరుతి సీజన్ దేశవ్యాప్తంగా లోటుతో ముగిసే పరిస్థితి కనిపిస్తోంది. వాతావరణ మార్పులు, రుతుపవనాల తీరు, ఎల్‌నినో వంటి ప్రభావాలు కూడా వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నాయి.వ్యవసాయం ఇప్పటికీ వానపై చాలా వరకు ఆధారపడి ఉంది. నైరుతి రుతుపవనాల సమయంలో వచ్చే వర్షాలే చెరువులను నింపాలి. వాగులు, వంకల్లో నీరు పారాలి. భూగర్భ జలాలు పెరగాలి. బోర్లలో నీరు ఉండాలి. ప్రాజెక్టులకు నీరు చేరాలి. అప్పుడే రైతు పొలంలో పంట నిలబడుతుంది. కానీ ఈసారి కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి తేడాగా ఉంది. ఒకవైపు వర్షం తక్కువగా పడుతోంది. మరోవైపు పడిన వాన కూడా ఒకే ప్రాంతంలో కురుస్తోంది. కొన్ని చోట్ల భారీ వర్షాలు పడుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో చినుకులు కూడా కరువవుతున్నాయి. దీంతో రాష్ట్ర సగటు లెక్క కంటే గ్రామం, మండలం స్థాయిలో రైతు ఎదుర్కొంటున్న కష్టం ఎక్కువగా కనిపిస్తోంది.వర్షం తగ్గితే మొదట నేలలో తేమ తగ్గుతుంది. తర్వాత చెరువుల్లోకి వచ్చే నీరు తగ్గుతుంది. ఆ తర్వాత భూగర్భ జలాలు పెరగవు. బోర్లు ఎండిపోతే రైతు ప్రాజెక్టుల వైపు చూస్తాడు. అక్కడి నుంచి కాలువల ద్వారా నీరు రావాలి. కాలువ చివరి ఆయకట్టులో ఉన్న రైతు పొలానికి కూడా నీరు చేరాలి. అప్పుడే ప్రాజెక్టులో ఉన్న నీరు రైతుకు ఉపయోగపడుతుంది. తెలంగాణ నీటి అసలు లెక్క మొదలవుతుంది. ప్రాజెక్టుల్లో నీరు ఉండటం ఒక లెక్క ఆ నీరు పొలానికి చేరడం మరో లెక్క. వర్షం తక్కువైతే రైతు కష్టం అక్కడితో ఆగదు. విత్తనం కొనాలి. ఎరువులు వేయాలి. మందులు కొనాలి. కూలీలకు డబ్బులు ఇవ్వాలి. నీరు లేకపోతే బోరు నడపాలి. విద్యుత్ ఖర్చు పెరుగుతుంది. పంట నిలబడకపోతే మళ్లీ విత్తనం వేయాల్సి వస్తుంది. ఇలా వాన తగ్గిన ప్రతి దశలో రైతు ఖర్చు పెరుగుతూనే ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే పంటలను తిరిగి విత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకసారి వేసిన పంట ఎండిపోతే మరోసారి పెట్టుబడి పెట్టాలి. రెండోసారి కూడా వాన రాకపోతే మరోసారి అప్పు చేయాల్సి వస్తుంది. చివరికి ఆకాశం వైపు చూసిన వాన..రైతు జేబులో అప్పుగా మారుతుంది. మరో వైపు ప్రాజెక్టుల నీటిపై రాజకీయ రచ్చ మొదలవుతోంది. ఎవరి హయాంలో ఏ ప్రాజెక్టు వచ్చిందని అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. రాజకీయ పార్టీలకు నీరు ఒక రాజకీయ అంశం కావచ్చు. కానీ రైతుకు మాత్రం నీరు జీవనాధారం. పంటకు నీరు రావాలి. పంట చేతికి రావాలి. పంటకు గిట్టుబాటు ధర రావాలి. అప్పు తీరాలి. ఇంటిని నడపాలి. రైతు ఆలోచన ఇలానే సాగుతోంది. నీటి లెక్కను కేవలం ప్రాజెక్టుల దగ్గర ఆపకూడదు. ఆకాశం నుంచి మొదలుపెట్టి రైతు పొలం వరకు చూడాలి. ఎంత వర్షం పడాలి. ఎంత పడింది. గత ఐదేళ్లలో ఎంత పడింది. పదేళ్ల సగటుతో పోలిస్తే పరిస్థితి ఎలా ఉంది. ఏ జిల్లాల్లో వర్షం తగ్గింది. ఏ మండలాల్లో లోటు ఎక్కువగా ఉంది. ఏ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. ఎన్ని చెరువులు నిండాయి. ఎన్ని ఖాళీగా ఉన్నాయి. ఈ లెక్కలన్నీ కలిపితేనే వర్షం ప్రభావం ఎంత పెద్దదో అర్థమవుతుంది.పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోనూ వర్షం ముఖం చాటేసింది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 6 వరకు రాష్ట్రంలో సాధారణం 452.9 మిల్లీమీటర్ల వర్షం పడాలి. కానీ ఇప్పటివరకు 203.9 మిల్లీమీటర్లే నమోదైంది. అంటే ఏకంగా 55 శాతం వర్ష లోటు. 28 జిల్లాల్లోనూ లోటు పరిస్థితే ఉంది. అన్నమయ్య జిల్లాలో 77.5 శాతం, ప్రకాశంలో 71.4 శాతం, విశాఖలో 60.4 శాతం లోటు నమోదైంది. దీంతో వర్షాధార వ్యవసాయంతో పాటు భూగర్భ జలాలు, చెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలపైనా ప్రభావం పడుతోంది.ఇప్పుడు నీటిని కేవలం ప్రాజెక్టుల సమస్యగా చూడలేం. వర్షపు నీటిని ఎంత వరకు ఒడిసిపట్టుకుంటున్నాం. చెరువులను ఎంత వరకు కాపాడుతున్నాం. భూగర్భ జలాలను ఎలా పెంచుతున్నాం. పట్టణాల్లో వర్షపు నీరు ఎంత వృథా అవుతోంది. గ్రామాల్లో చెరువులు, కుంటలు, కాలువల పరిస్థితి ఎలా ఉందో ఆలోచించాలి. ఒక గ్రామాన్ని తీసుకుంటే ఈ సమస్య మొత్తం కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. ఆ గ్రామంలో సాధారణంగా ఎంత వర్షం పడుతుంది. ఈసారి ఎంత పడింది. చెరువులోకి ఎంత నీరు వచ్చింది. బోర్లలో నీటి మట్టం ఎంత తగ్గింది. ఎన్ని బోర్లు పనిచేస్తున్నాయి. ఎన్ని ఎండిపోయాయి. ఎన్ని ఎకరాల్లో పంట వేశారు. ఎన్ని ఎకరాలకు నీరు అందింది. ఎంత పెట్టుబడి పెట్టారు. పంట దెబ్బతింటే రైతుకు ఎంత నష్టం వచ్చింది. చివరికి ఎంత అప్పు మిగిలింది. ఈ లెక్కను ఒక గ్రామం నుంచి చూపిస్తే తెలంగాణ మొత్తం నీటి కష్టాన్ని అర్థం చేసుకోవచ్చు.తెలంగాణలో వానాకాలం సాధారణ సాగు విస్తీర్ణం 132.4 లక్షల ఎకరాలు. ఈసారి సెప్టెంబర్ 2 నాటికి 119.6 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. అంటే సాధారణ సాగులో దాదాపు 90 శాతం పూర్తయింది. గతేడాది ఇదే సమయానికి 123.5 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. ఏపీలోనైతే సాధారణ విస్తీర్ణం 76.2 లక్షల ఎకరాలు. ఈసారి వేసింది 57.8 లక్షల ఎకరాలు. గతంలో పోల్చుకుంటే 18.4 లక్షల ఎకరాలు తగ్గింది. అంటే సాధారణ సాగుతో పోలిస్తే 24.1 శాతం తక్కువగా ఉంది.దేశవ్యాప్తంగా ఈసారి ఖరీఫ్‌లో సెప్టెంబర్ 4 నాటికి 1,086 లక్షల హెక్టార్లలో సాగు జరిగింది. అంటే సుమారు 268.5 మిలియన్ ఎకరాల్లో పంటలు వేశారు. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే దేశంలో సాగు విస్తీర్ణం 1.6 శాతం తక్కువగా ఉంది.మబ్బులో నుంచి వచ్చిన నీటిలో ఎంత మన దగ్గర నిలిచింది. చెరువుల్లో ఎంత చేరింది. భూగర్భంలోకి ఎంత వెళ్లింది. ప్రాజెక్టుల్లో ఎంత నిల్వ ఉంది. కాలువల్లోకి ఎంత విడుదలైంది. రైతు పొలానికి ఎంత చేరింది. ఆ నీటితో ఎంత పంట పండింది. ఆ పంటతో రైతు చేతిలో చివరికి ఎంత మిగిలింది. ఈ మొత్తం లెక్కే తెలంగాణ నీటి అసలు లెక్క.ఆకాశం వాన ఇవ్వాలి. చెరువు నీటిని దాచుకోవాలి. ప్రాజెక్టు నీటిని పొలానికి చేర్చాలి. రైతు పంట పండించాలి. పంటకు మంచి ధర రావాలి. అప్పు తీరాలి. అప్పుడే నీటి లెక్క రైతు జీవితంలో మంచి ఫలితంగా మారుతుంది. వాన కోసం ఆకాశం వైపు చూసే రైతు కళ్లలో నీరు కాదు. నమ్మకం ఉండాలి. ఆ నమ్మకాన్ని నిలబెట్టేది కేవలం వర్షం కాదు. మన నీటి నిర్వహణ అనేది నిజం. ఆ దిశగా పాలకులు ఆలోచిస్తే అన్నదాత ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.

# ఇస్రో భవితపై నీలినీడలు?

న్యూఢిల్లీ,దశాబ్దాలుగా భారత అంతరిక్ష రంగానికి దిక్సూచిగా నిలిచిన అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)పై తాజాగా తలెత్తిన వివాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇస్రోను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ తొమ్మిది ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేయడంతో ఈ అంశం ఒక్కసారిగా చర్చనీయాంశమైంది. సంస్థ ప్రైవేటీకరణకు ఎలాంటి ప్రతిపాదన లేదని ఇస్రో చైర్మన్ నారాయణన్ స్పష్టం చేసినప్పటికీ ఉద్యోగుల్లో నెలకొన్న సందేహాలకు పూర్తిగా తెరపడలేదు. ఇస్రోను ప్రైవేటీకరిస్తున్నారన్నదే కాదు.. ఇస్రో కార్యకలాపాల్లో ప్రైవేటు రంగం భాగస్వామ్యం క్రమంగా పెరుగుతోందన్నది కూడా ఆందోళన కలిగించే అంశమే. అంతరిక్ష రంగంలో సంస్కరణల అనంతరం ప్రైవేటు సంస్థలకు గతంలో ఎన్నడూ లేనంతగా అవకాశాలు లభిస్తున్నాయి. ప్రపంచ అంతరిక్ష రంగం శరవేగంగా విస్తరిస్తున్న తరుణంలో భారతదేశం కూడా వాణిజ్యపరమైన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడంలో తప్పు లేదు. అయితే ఆ ప్రక్రియలో ఇస్రో ప్రాధాన్యం, స్వతంత్ర ప్రతిపత్తి దెబ్బతినకుండా చూడటం అత్యంత కీలకం. ఇప్పటికే దేశంలో 400కుపైగా స్పేస్‌టెక్ స్టార్టప్‌లు ఏర్పడ్డాయి.స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్ వంటి సంస్థలు రాకెట్ల తయారీలో తమ సామర్థ్యాన్ని చాటుతున్నాయి. మొన్న జులైలో స్కైరూట్ రూపొందించిన విక్రమ్-1 ప్రయోగం భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఇక బెలాట్రిక్స్ ఏరోస్పేస్, మానస్తు వంటి సంస్థలు కూడా ప్రొపల్షన్ సహా వివిధ అత్యాధునిక సాంకేతిక రంగాల్లో పనిచేస్తున్నాయి. భారత్‌లో బలమైన ప్రైవేటు అంతరిక్ష పరిశ్రమకు బీజం పడిందనడానికి ఇవే ఉదాహరణలు. ఇక ఇస్రోకు ప్రైవేట్ పరిశ్రమలతో అనుబంధం కొత్తది కాదు. సంస్థకు అవసరమైన విడిభాగాలు, పరికరాలను ప్రైవేటు పరిశ్రమలు చాలాకాలంగా సరఫరా చేస్తున్నాయి. ఇప్పుడు ఆ పరిధి మరింత విస్తరిస్తోంది. ఇస్రో అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశ్రమలకు బదిలీ చేయడం కూడా ఇందులో భాగమే. చిన్న ఉపగ్రహ ప్రయోగ వాహనం (ఎస్‌ఎస్‌ఎల్‌వి) తయారీ సాంకేతిక పరిజ్ఞానాన్ని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌కు ఇస్రో బదిలీ చేయడం ఇందుకు ఉదాహరణ. ఇలాంటి సాంకేతిక బదిలీ ఒప్పందాలు వందకు చేరుకోవడం కూడా గమనార్హం. అయితే ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతోంది. ఇస్రో అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానం ప్రైవేటు పరిశ్రమలకు బదిలీ చేయడం ద్వారా దేశానికి మేలు జరుగుతుందా? లేక భవిష్యత్తులో ఇస్రో తన సాంకేతిక సామర్థ్యాలను కోల్పోయే పరిస్థితి వస్తుందా?.. ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం అవసరం.ఆర్యభట్ట నుంచి చంద్రయాన్-3 వరకు, మంగళ్‌యాన్ నుంచి ఆదిత్య-ఎల్1 వరకు ఎన్నో



అద్భుత విజయాలను సాధించిన సంస్థ ఇస్రో. పరిమిత వనరులతో ప్రపంచంలోని ప్రముఖ అంతరిక్ష సంస్థల సరసన భారత్‌ను నిలబెట్టిన ఘనత ఈ సంస్థ సొంతం. అంతరిక్ష పరిశోధనతోపాటు దేశరక్షణ, వాతావరణ అంచనాలు, వ్యవసాయం, విపత్తు నిర్వహణ, కమ్యూనికేషన్ వంటి అనేక రంగాలకు ఇస్రో అందిస్తున్న సేవలు అపారమైనవి. అందువల్ల ఇస్రోను కేవలం రాకెట్లు తయారు చేసే సంస్థగా చూడటం పొరపాటు. అది దేశ శాస్త్రీయ, సాంకేతిక సామర్థ్యానికి ప్రతీక. ఆ సంస్థను మరింత బలోపేతం చేయాల్సిన సమయంలో ఉద్యోగుల్లో ప్రైవేటీకరణ భయాలు నెలకొనడం మంచి పరిణామం కాదు. గత కొన్నేళ్లుగా ఉద్యోగుల సంఖ్య, నైపుణ్యం కలిగిన మానవ వనరుల వలస వంటి అంశాలపై తలెత్తుతున్న సందేహాలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. ప్రైవేటీకరణ జరగదని ఇస్రో చైర్మన్ ఇచ్చిన హామీకి విధానపరమైన స్పష్టత కూడా తోడైతే ఉద్యోగుల ఆందోళనలకు తెరపడుతుంది.ఇస్రోలో ఏ కార్యకలాపాలు కొనసాగాలి? ప్రైవేటురంగానికి ఏ బాధ్యతలు అప్పగించాలి? కీలక సాంకేతిక పరిజ్ఞానంపై తుది నియంత్రణ ఎవరిది? భవిష్యత్తులో ఇస్రో మానవ వనరులను ఎలా బలోపేతం చేయాలి? వంటి అంశాలపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించాల్సిన సమయం ఇదే. ఇస్రో, ప్రైవేటు రంగం పరస్పర ప్రత్యర్థి సంస్థలు కాదు. ఒకటి పరిశోధనకు, జాతీయ ప్రయోజనాలకు వెన్నెముకగా ఉంటే.. మరొకటి ఆ సాంకేతికతను వాణిజ్యపరంగా విస్తరించే శక్తిగా నిలవాలి. రెండూ కలిసి పనిచేస్తే భారత అంతరిక్ష రంగం ప్రపంచంలో మరింత ఉన్నత స్థానానికి చేరుతుంది. అయితే ఆ ప్రయాణంలో ఇస్రో స్వతంత్రతపై నీలినీడలు కమ్ముకోకూడదు. అంతరిక్షంలో భారత పతాకం ఎగరడానికి ఇస్రో బలమే పునాది. ఆ పునాదిని మరింత పటిష్ఠం చేయడమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత కావాలి.

# మైలేజ్ ఎవరికి డ్యామేజ్ ఎవరికి



హైదరాబాద్, తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాల తొలిరోజే అసెంబ్లీ ప్రాంగణం తీవ్ర ఉద్రిక్తతకు, రాజకీయ వ్యూహప్రతివ్యూహాలకు వేదికగా మారింది. సభ లోపల ఏం జరిగిందనే దానికంటే కూడా, సభ బయట ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ , అధికార కాంగ్రెస్ మధ్య నడిచిన పొలిటికల్ వార్ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అసెంబ్లీ ప్రారంభానికి ముందే పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన బీఆర్ఎస్ నాయకత్వం, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు నల్ల చొక్కాలు ధరించి, ప్లకార్డులతో నిరసనకు దిగింది. కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలో గులాబీ శ్రేణులు చేసిన ఈ హంగామాతో మీడియా దృష్టి మొత్తం ఒక్కసారిగా వారివైపే మళ్లింది.అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు నిరసనకారులను అడ్డుకోవడంతో తోపులాట జరిగి వాతావరణం మరింత వేడెక్కింది. ప్రభుత్వంపై నైతిక విజయం సాధించి, రాజకీయాన్ని పూర్తిగా తమకు అనుకూలంగా మార్చుకోవాలన్న బీఆర్ఎస్ వ్యూహం మొదటి దశలో విజయవంతమైనట్లే కనిపించింది. మీడియా అటెన్షన్ సాధించడం, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రక్షణలో పడేయడంలో ప్రతిపక్షం అనుకున్న లక్ష్యాన్ని దాదాపు చేరుకుంది. అయితే, ఈ పొలిటికల్ గేమ్‌లో బీఆర్ఎస్ సాధించిన మైలేజ్ అంతా ఒక్క చిన్న తొందరపాటు వ్యాఖ్యతో తలకిందులైంది.భద్రతా సిబ్బందితో జరిగిన తోపులాట, పోలీసుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేసే క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. స్పీకర్ పదవినీ, వ్యవస్థలను ఉద్దేశించి ఆయన చేసినట్లుగా ప్రచారంలోకి వచ్చిన అనుచిత వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారాన్ని లేపాయి. ప్రభుత్వ విధానాలపై దాడి చేయాల్సిన ప్రతిపక్షం, ఈ ఒక్క ఘటనతో ఒక్కసారిగా స్వయంగా ఆత్మరక్షణలో పడిపోవాల్సిన పరిస్థితి తలెత్తింది. నిరసనలతో సంపాదించిన మైలేజ్ కాస్తా ఈ వివాదంతో ఆవిరైపోయింది. బీఆర్ఎస్ దూకుడుకు కౌంటర్ ఇచ్చేందుకు సరైన అవకాశం కోసం చూస్తున్న అధికార కాంగ్రెస్‌కు తాతా మధు వ్యాఖ్యలు అతిపెద్ద అస్త్రంగా మారాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహలతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా బీఆర్ఎస్ వైఖరిపై విరుచుకుపడ్డారు. దళిత వర్గానికి చెందిన సభాపతిని, రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ స్థానాన్ని అవమానించారంటూ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీంతో పొలిటికల్ నరేటివ్ ఒక్కసారిగా మారిపోయి కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యంలోకి వచ్చింది.అధికార పక్షం నుంచి అనూహ్య రీతిలో ఎదురుదాడి జరగడం, సమాజంలో కూడా ప్రతికూల సంకేతాలు వెళుతున్నాయని గ్రహించిన బీఆర్ఎస్ తీవ్ర ఒత్తిడికి లోనైంది. వివాదం మరింత ముదరకుండా ఉండేందుకు ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే స్పందిస్తూ, తాను సభాధిపతిని ఉద్దేశించి ఆ మాటలు అనలేదని, కేవలం తమపై దౌర్జన్యం చేసిన పోలీసుల తీరుపైనే మాట్లాడానని వివరణ ఇచ్చుకున్నారు. ఏదేమైనా ఆ వ్యాఖ్యల వల్ల ఎవరైనా మనస్తాపం చెంది ఉంటే ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించక తప్పలేదు. వర్షాకాల సమావేశాల తొలిరోజు అసెంబ్లీ వెలుపల నడిచిన ఈ పొలిటికల్ డ్రామా తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర మైండ్ గేమ్‌కు అద్దం పట్టింది. ఆరంభంలో నల్ల టీషర్టుల నిరసనతో హంగామా సృష్టించి పైచేయి సాధించిన బీఆర్ఎస్, సొంత నేత చేసిన వ్యాఖ్యల వల్ల చివరకు డిఫెన్స్‌లో పడాల్సి వచ్చింది. సమయాన్ని ఏమాత్రం వృథా చేయకుండా ఆ తప్పును పట్టుకుని తిప్పికొట్టిన కాంగ్రెస్, మొదటిరోజు పొలిటికల్ అడ్వాంటేజ్ సాధించడంలో విజయం సాధించిందనే చెప్పాలి.

### ప్రూఫ్ లతో చూపించిన అధికార పార్టీ

తెలంగాణ అసెంబ్లీ వేదికగా అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య సాగుతున్న రాజకీయ యుద్ధం ఊహించని మలుపులు తిరుగుతోంది. సమావేశాల ప్రారంభ వేళ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసి ఇరకాటంలో పెట్టాలని భావించిన బీఆర్ఎస్, అనూహ్యంగా తానే తీవ్ర ఆత్మరక్షణలోకి జారుకుంది. ఆందోళనలతో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని వేసిన ఎత్తుగడలు కాస్తా, అధికార పక్షం విడుదల చేసిన వీడియో ఆధారాలు, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల దుమారంతో బెడిసికొట్టాయి.అసెంబ్లీ సమావేశాల తొలి రోజే నల్ల టీషర్టులు ధరించి, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన ర్యాలీతో సభలోకి ప్రవేశించాలని బీఆర్ఎస్ వ్యూహం రచించింది. అయితే అసెంబ్లీ సమీపంలో పోలీసులు గులాబీ నేతలను అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు తమ ప్రజాప్రతినిధులపై దౌర్జన్యం చేశారని, మహిళా సభ్యులతో దురుసుగా ప్రవర్తించారని బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆరోపణలు గుప్పించారు. మహిళా ఎమ్మెల్యేలు మీడియా ముందే కన్నీటిపర్యంతం కావడం, కొందరు నేతలకు గాయాలయ్యాయని ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందడంతో తొలిరోజు ప్రజల్లో కాస్త సానుభూతి వ్యక్తమైంది. పోలీసుల అత్యుత్సాహమే ఇందుకు కారణమంటూ ప్రభుత్వంపై నైతిక దాడిని ప్రారంభించింది.బాధితుల కార్డుతో పైచేయి సాధించవచ్చని భావించిన గులాబీ దళానికి ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్ ఊహించని షాక్ ఇచ్చింది. ఘటనా స్థలంలో రికార్డయిన వీడియోలు, ఫోటోలను ప్రభుత్వం ఆధారాలతో సహా మంగళవారం బహిర్గతం చేయడంతో కథ అడ్డం తిరిగింది. పోలీసులు దాడి చేయలేదని, గులాబీ ప్రజాప్రతినిధులే ఖాకీలపై భౌతిక దాడులకు దిగారని ఈ దృశ్యాలు స్పష్టం చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తిస్తున్న పోలీసుల చొక్కాలు పట్టుకుని లాగడం, విధుల్లో ఉన్న మహిళా పోలీసులపైకి దూసుకువెళ్లడం కనిపించింది. వీటన్నింటికీ మించి స్వయంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓ పోలీసు అధికారిని తోసేస్తున్న దృశ్యాలు వెలుగులోకి రావడంతో బీఆర్ఎస్ కథనం ఒక్కసారిగా బలహీనపడింది. శాంతిభద్రతలను కాపాడే పోలీసులపైనే దాడి చేసి, ఎదురు బాధితులమని ప్రచారం చేసుకోవడం ఏమిటన్న ప్రశ్నలు ప్రజాక్షేత్రంలో మొదలయ్యాయి.

# వైసీపీ నేతలతోనే షర్మిల కూతురి వివాహం

కర్నూలు,ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఇంట్లో త్వరలోనే పెళ్లి బాజాలు మోగబోతున్నాయి. ఆమె కుమార్తె అంజలి వివాహం అమెరికాలో డాక్టర్‌గా స్థిరపడిన సోముల రఘురామిరెడ్డితో నిశ్చయమైంది. ఈ శుభవార్తతో వైయస్సార్ కుటుంబంలో ఉత్సాహ వాతావరణం నెలకొంది. అయితే, ఇంతకీ ఎవరీ ఎవరీ సోముల రఘురామిరెడ్డి? అనేది ఇప్పుడు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది.ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల కూతురు అంజలి వివాహం అమెరికాలో స్థిరపడిన డాక్టర్ సోముల రఘురామిరెడ్డితో నిశ్చయమైంది. స్వస్థలం నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం వీరాపురం గ్రామానికి చెందిన సోముల సుబ్బారెడ్డి కుమారుడే ఈ రఘురామిరెడ్డి. ప్రస్తుతం నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం వీరాపురం గ్రామానికి చెందిన సోముల సుబ్బారెడ్డి కుమారుడే రఘురామిరెడ్డి. చిన్నతనంలో నంద్యాలలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో మేనత్త ఇంట్లో ఉంటూ ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఆ తర్వాత ఆయన తండ్రి సుబ్బారెడ్డి ఉద్యోగ/వ్యాపార రీత్యా ఇండోనేషియా వెళ్లడం, అక్కడ నుండి కుటుంబ సమేతంగా అమెరికాకు మారడంతో ఆ కుటుంబం అమెరికాలోనే స్థిరపడింది. ప్రస్తుతం రఘురామిరెడ్డి అక్కడ వైద్యుడిగా సేవలందిస్తున్నారు.అంజలి, రఘురామిరెడ్డిల మధ్య ముందే పరిచయం ఉండటంతో, వీరి వివాహానికి ఇరు కుటుంబాల పెద్దలు సుముఖత వ్యక్తం చేశారు. ఇటీవల అంజలి అమ్మమ్మ వైయస్ విజయమ్మ, తల్లి వైయస్ షర్మిల, తండ్రి బ్రదర్ అనిల్ కుమార్, అంజలి అందరూ కలిసి రఘురామిరెడ్డి కుటుంబసభ్యులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సమావేశంలో సంబంధానికి అందరూ అంగీకరించి, గ్రూప్ ఫోటోలు కూడా తీసుకున్నారు.ఇరు కుటుంబాల అంగీకారంతో ఈ నెల 24వ తేదీన హైదరాబాద్‌లోని కొత్వాల్‌గూడ వద్ద ఉన్న

# పార్టీల పేర్లతో ఐడీలు తీవ్రమైన ఈగో పోరు

విజయవాడ,ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వ విధానాలు, విజయాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుపడుతున్న ప్రధాన శక్తి ప్రతిపక్షం కంటే కూడా ఇరు పార్టీల సానుభూతిపరులుగా సోషల్ మీడియాలో చెలామణి అవుతున్నవారే. అనడంలో ఎలాంటి సందేహం లేదు. క్షేత్రస్థాయిలో నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పొత్తు ధర్మాన్ని పాటించి పాలనపై దృష్టి సారిస్తుంటే, సోషల్ మీడియాలో ఇరు పార్టీల పేర్లతో తిరిగే ఐడీలు తీవ్రమైన ఈగో పోరుతో కూటమి స్ఫూర్తికే ఘోరమైన విఘాతం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా సినీ హీరోల అభిమానుల మధ్య ఉండే పాత కక్షలు, వ్యక్తిగత ఆధిపత్య పోరును రాజకీయాలకు రుద్ది, పరస్పరం పార్టీ అధినేతలను, వారి కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషించుకునే స్థాయికి దిగజారిపోతున్నారు.సాధారణంగా ఏ రాజకీయ పార్టీకైనా సోషల్ మీడియా విభాగం లేదా సానుభూతిపరులు అనేది ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా సంస్కరణలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే డిజిటల్ సైన్యంలా పనిచేయాలి. అయితే ఈ రెండు పార్టీల సోషల్ మీడియా అతివాదులు మాత్రం ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలను పక్కనబెట్టి.. పరస్పరం చురకలు వేసుకోవడానికి, ఎన్టీఆర్ లేదా చిరంజీవి వంటి దిగ్గజాల పేర్లను లాగి బురద చల్లుకోవడానికే సమయాన్ని వెచ్చిస్తున్నారు. అసలైన ప్రాధాన్యతలను విడిచిపెట్టి వ్యక్తిగత ద్వేషాన్ని ప్రచారం చేసే వీరు ఎంతమాత్రం పార్టీ సానుభూతిపరులు అనిపించుకోరు, పైగా ప్రత్యర్థి పార్టీ వైఎస్ఆర్‌సీపీకి అయాచితంగా పొలిటికల్ అడ్వాంటేజ్‌ను ప్లేట్‌లో పెట్టి ఇస్తున్నారు.వైసీపీ అమలు చేస్తున్న ఫేక్ నెరేటివ్‌లు, ప్రభుత్వ విధానాలపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను సంయుక్తంగా తిప్పికొట్టాల్సిన సమయంలో.. ఈ రెండు వర్గాలు ఒకరి శాఖల్లోని లోపాలను మరొకరు వెతికి నెట్‌లో రచ్చకెక్కడం కూటమి ప్రభుత్వ పరువు తీస్తోంది. ఇటు టీడీపీ శ్రేణులు, అటు జనసేన సైనికులు పరస్పరం డిపార్ట్‌మెంట్ వ్యాఖ్యలపై కౌంటర్లు ఇచ్చుకోవడం వల్ల ప్రజల్లోకి ప్రభుత్వంలో సమన్వయం లేదు అనే తీవ్ర ప్రతికూల సంకేతాలు వెళ్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న ఈ కీలక సమయంలో, ప్రయివేటు అకౌంట్ల నుంచి జరిగే ఈ విపరీతమైన ఈగో వార్ రాజకీయంగా కూటమి పునాదులకే ఎసరు పెట్టే ప్రమాదం ఉంది. దీన్ని ఆసరా చేసుకుని వైసీపీ సోషల్ మీడియా టీడీపీ, జనసేన పేరుతో ఫేక్ అకౌంట్లను రంగంలోకి తెచ్చి మరింతగా వివాదాలను పెంచుతోది.ఈ పరిస్థితికి చెక్ పెట్టాలంటే కేవలం హెచ్చరికలు, హితవులతో సరిపెట్టుకుంటే లాభం లేదు. ఇరు పార్టీల నాయకత్వాలు సీరియస్‌గా స్పందించి, తమ అధికారిక సోషల్ మీడియా వింగ్‌ల ద్వారా క్రమశిక్షణను కఠినంగా అమలు చేయాల్సి ఉంది. హద్దులు దాటి పరస్పర అధినేతలను, కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషిస్తున్న ఐడీలను గుర్తించి, వారు సొంత కేడర్ అయినా సరే సైబర్ పోలీసుల ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదా పార్టీల నుంచి బహిరంగంగా దూరం పెట్టడం చేయాలి. పార్టీ ఆత్మగౌరవం కంటే కూటమి బంధం, ప్రభుత్వ స్థిరత్వమే ముఖ్యమని ఇరు అధినేతలు కేడర్‌కు గట్టిగా స్పష్టం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఉమ్మడి రాజకీయ ప్రత్యర్థి వైఎస్ఆర్‌సీపీపై పోరాడటాన్ని మర్చిపోయి, తమలో తామే సోషల్ మీడియాలో కొట్టు చావడం అనేది కూటమి ఐక్యతకు కన్పించని శత్రువులా మారింది.

# బుల్డోజర్లు పెట్టిన కదలని హనుమాన్...

భోపాల్, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రాచీన హనుమంతుని ఆలయాన్ని తొలగించారు. అయితే, అందులోని హనుమ విగ్రహాన్ని మాత్రం అక్కడ నుంచి తరలించడం సాధ్యం కాలేదు. నాలుగు రోజుల పాటు అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించి, భారీ యంత్రాలతో ప్రయత్నించినా... విగ్రహం ఒక్క అంగుళం కూడా కదల్లేదు. ఈ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో చోటుచేసుకుంది. కంతాల్ చౌరాహా - ఛత్రీ చౌక్ రహదారిపై ఉన్న 'ఖడే హనుమాన్' ఆలయానికి దాదాపు 170 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతుంటారు. 2028లో జరగబోయే 'సింహస్థ కుంభమేళా' కోసం నగరంలో మౌలిక వసతుల విస్తరణ, రోడ్ల వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుణ్యకాలంలో క్షిప్రా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు పరమశివుడి క్షేత్రమైన ఉజ్జయినికి తరలివస్తారు. అందులో భాగంగానే రహదారి విస్తరణ చేపట్టగా.. పురాతన ఆలయాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉజ్జయిని మునిసిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం ఈ విగ్రహాన్ని టాంకీ చౌక్ సమీపంలో నూతనంగా నిర్మించే ప్రాంతానికి సురక్షితంగా తరలించాలని ప్రణాళిక రచించాయి.ఆలయాన్ని పూర్తి స్థాయిలో తొలగించినప్పటికీ, నిలబడి ఉన్న హనుమంతుని విగ్రహం మాత్రం ఉన్న చోటు నుంచి కదల్లేదు. అధికారులు, కార్మికులు భారీ యంత్రాల (జేసీబీలు, క్రేన్లు) సహాయంతో విగ్రహాన్ని తరలించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. స్థానిక మీడియా నివేదిక ప్రకారం, గత కొద్ది రోజుల్లో నాలుగుసార్లు జరిపిన ప్రయత్నాలు విఫలం కావడంతో, అధికారులు భారీ యంత్రాల వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు

### 'దైవ లీల'గా ప్రచారం

విగ్రహాన్ని కదిలించడంలో అధికారులు విఫలమవడంతో ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అనేకమంది దీనిని దైవ లీలగా అభివర్ణిస్తున్నారు. అదే సమయంలో ఆలయ ప్రాంగణం వద్దకు పెద్ద ఎత్తున కోతులు గుమిగూడిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో నమ్మకం మరింత బలపడింది.ఆలయ అర్చకుడు మహేష్ బైరాగి మాట్లాడుతూ.. వరుసగా జరుగుతున్న ఈ విఫల యత్నాలు స్వామివారు ఇక్కడే ఉండాలనుకుంటున్నారనడానికి సంకేతమని అన్నారు. "హనుమంతుడు ప్రతిరోజూ తాను ఇక్కడే ఉండాలనుకుంటున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు.. అధికార యంత్రాంగం ఈ సంకేతాలను అర్థం చేసుకోవాలని నేను వినమ్రంగా వేడుకుంటున్నాను. ఒకవేళ విగ్రహాన్ని తొలగించాల్సి వస్తే, అది ఎటువంటి దెబ్బతినకుండా ప్రస్తుతం ఏ రూపంలో ఉందో అదే విధంగా భద్రంగా తరలించాలి. పూర్తి భద్రత హామీ ఇచ్చే వరకు విగ్రహాన్ని కదిలించే ప్రయత్నం చేయకూడదు" అని ఆయన తెలిపారు.

# చిరంజీవి కుమార్తె సుస్మితకు కీలక పదవి..

విజయవాడ,మెగాస్టార్ చిరంజీవి కుమార్తె, సినీ నిర్మాత కొణిదెల సుస్మితకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు లభించాయి. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డులో ఆమెను ప్రత్యేక ఆహ్వానితురాలిగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి కన్నబాబు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.ఈ నియామకంతో సుస్మిత ఇకపై దుర్గమ్మ ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామి కానున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు కల్పిస్తున్న వసతులు, ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనులు, దసరా నవరాత్రులు వంటి ప్రత్యేక ఉత్సవాల నిర్వహణపై ఆమె ట్రస్ట్ బోర్డుకు తగిన సలహాలు, సూచనలు అందిస్తారు.సుస్మిత కొణిదెల 'గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్' బ్యానర్‌పై చిత్రాలను నిర్మిస్తూ నిర్మాతగా రాణిస్తున్నారు. ఇటీవల తన తండ్రి చిరంజీవితో నిర్మించిన 'మన శంకర వర ప్రసాద్ గారు' చిత్రంతో ఆమె మంచి విజయాన్ని

## 66 కిలోలకుపైగా బంగారం.. 3
## 35 కిలోల వెండితో గణనాథుడు

ముంబై ,విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు.. భక్తుల కోరికలను తీర్చే గణనాథుడు.. గణేశోత్సవం వచ్చిందంటే దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక సందడి మొదలవుతుంది. ముఖ్యంగా ముంబైలో జరిగే గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. భక్తి, సంప్రదాయం, సేవ, వైభవం కలగలిసిన గణపతి ఉత్సవాలు ప్రతి ఏటా లక్షలాది మందిని ఆకర్షిస్తాయి. అలాంటి విశిష్ట గణపతి ఉత్సవాల్లో ముంబైలోని కింగ్స్ సర్కిల్‌లో ఉన్న జీఎస్ బీసేవా మండల్ మహాగణపతి ఉత్సవం ఒకటి. ఈ ఏడాది 72వ గణేశోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు మండల్ సిద్ధమైంది. ఈసారి మహాగణపతికి ఏకంగా రూ.703.27 కోట్ల భారీ బీమా రక్షణ కల్పించారు. బంగారం, వెండి ఆభరణాలతో పాటు ఉత్సవాలకు సంబంధించిన విలువైన వస్తువులు, భక్తుల రాకపోకలు తదితర అంశాలకు ఈ బీమా రక్షణ కల్పిస్తోంది.మహాగణపతి విగ్రహానికి ఈ ఏడాది 66 కిలోలకుపైగా బంగారు ఆభరణాలు, 335 కిలోలకుపైగా వెండి ఆభరణాలు అలంకరించనున్నట్లు సమాచారం. వీటికి తోడు విలువైన రత్నాలు కూడా గణనాథుడి అలంకరణలో భాగం కానున్నాయి. ఈ ఆభరణాల్లో చాలా వరకు భక్తులు, సేవాదారులు సంవత్సరాలుగా స్వామివారికి సమర్పించినవే. భక్తుల విశ్వాసానికి ప్రతీకలుగా నిలిచిన ఈ ఆభరణాలు ప్రతి సంవత్సరం మహాగణపతి అలంకరణలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. బంగారం, వెండి ధరలు భారీగా పెరగడంతో ఈ ఆభరణాల విలువ కూడా గణనీయంగా పెరిగింది. దాంతో గత సంవత్సరాలతో పోలిస్తే ఈసారి బీమా విలువ కూడా భారీగా పెరిగింది. 2024లో సుమారు రూ.400 కోట్ల బీమా ఉండగా, 2025లో అది రూ.474 కోట్లకు చేరింది. ఇప్పుడు 2026లో ఏకంగా రూ.703.27 కోట్లకు పెరగడం గణపతి ఉత్సవ వైభవాన్ని తెలియజేస్తోంది. ముంబైలో 1951లో ఊః సేవా మండల్ ఏర్పాటైంది. 1955లో గణేశోత్సవ వేడుకలను ప్రారంభించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా మహాగణపతి ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తోంది. ఈ ఏడాది మహాగణపతి తొలి ప్రజా దర్శనాన్ని 'విరాట్ దర్శన్' పేరుతో సెప్టెంబర్ 12న రాత్రి 8 గంటలకు ప్రారంభించనున్నారు. ప్రధాన ఐదు రోజుల గణేశోత్సవం సెప్టెంబర్ 14 నుంచి సెప్టెంబర్ 18 వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా లక్షలాది మంది భక్తులు గణనాథుడిని దర్శించుకునేందుకు తరలివచ్చే అవకాశం ఉంది.

లక్షకు పైగా పూజలు.. ప్రతిరోజూ 40 వేల మందికి అన్నదానం

సేవా మండల్ ఉత్సవం కేవలం బంగారు, వెండి ఆభరణాలు, భారీ అలంకరణలతో మాత్రమే ప్రత్యేకం కాదు. భక్తి, సేవ, అన్నదానం ఈ ఉత్సవంలో ప్రధాన భాగాలు. ఈ ఐదు రోజుల్లో భక్తులు, సేవాదారుల ద్వారా లక్షకు పైగా పూజలు, సేవలు నిర్వహించబడతాయని మండల్ అంచనా వేస్తోంది. అదేవిధంగా ప్రతిరోజూ సుమారు 40 వేల మందికి ప్రసాద భోజనం అందించేందుకు అన్నదాన సేవను నిర్వహించనున్నారు. అంటే ఐదు రోజుల్లో కలిపి రెండు లక్షల మందికిపైగా భక్తులకు అన్నప్రసాదం అందే అవకాశం ఉంది. 'అన్నదానం మహాదానం' అనే భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయానికి ఇది ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తోంది.ఈ ఏడాది ఉత్సవాల్లో పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. మహాగణపతి విగ్రహాన్ని పూర్తిగా పర్యావరణహితంగా రూపొందించనున్నారు. అంతేకాకుండా పూజలు, సేవలు, విరాళాలకు సంబంధించి గతంలో ఉపయోగించే ముద్రిత రసీదులను నిలిపివేసి డిజిటల్ రసీదుల విధానాన్ని అమలు చేస్తున్నారు. భక్తి కార్యక్రమాలతో పాటు పర్యావరణాన్ని కాపాడే బాధ్యతను కూడా గుర్తుచేస్తున్న ఈ ప్రయత్నం అభినందనీయం.ముంబై ఊః సేవా మండల్ మహాగణపతి ఉత్సవం కేవలం ఒక భారీ ఉత్సవం మాత్రమే కాదు. భక్తుల విశ్వాసం, తరతరాల సంప్రదాయం, దైవ సేవ, అన్నదానం, పర్యావరణ పరిరక్షణ.. ఇవన్నీ కలిసిన ఒక ఆధ్యాత్మిక వేడుక. బంగారు, వెండి ఆభరణాలతో మహాగణపతి అలంకారం ఎంత వైభవంగా కనిపించినా.. భక్తులకు అన్నదానం చేయడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలే ఈ ఉత్సవానికి మరింత ఆధ్యాత్మిక శోభను తీసుకొస్తాయి.

## ఇస్రోలో ప్రైవేటీరణం...

చెన్నై, సాధారణంగా పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ వంటి ప్రయోగ వాహకాలను సిద్ధం చేసి ప్రయోగించేందుకు నెలల సమయం పడుతుంది. ఒక్కో ప్రయోగానికి రెండు నుంచి మూడు నెలల సమయం కూడా అవసరమవుతుంది. అయితే చిన్న ఉపగ్రహాలను తక్కువ సమయంలో అంతరిక్షంలోకి పంపేందుకు ఎస్ఎస్ఎల్వీ ? స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ ? అనే కొత్త తరహా ప్రయోగ వాహకాన్ని ఇస్రో అభివృద్ధి చేసింది. వారం నుంచి పది రోజుల వ్యవధిలోనే ప్రయోగానికి సిద్ధమయ్యేలా దీనిని రూపొందించారు. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రయోగాత్మక ప్రయోగాలు కూడా విజయవంతంగా జరిగాయి. ప్రస్తుతం శ్రీహరికోట నుంచి దేశ అవసరాలకు సంబంధించిన కీలక అంతరిక్ష ప్రయోగాలు కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో శ్రీహరికోటకు ప్రత్యామ్నాయంగా తమిళనాడులో రెండో రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పాటు చేయాలనే ప్రయత్నాలు కూడా చాలా కాలంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నిర్మాణం చివరి దశకు చేరుకుని దాదాపు పూర్తికావస్తోంది.తమిళనాడులోని కులశేఖరపట్నంలో నిర్మిస్తున్న ఈ రెండో రాకెట్ ప్రయోగ కేంద్రం అత్యంత కీలకమైనది. అయితే ఈ కేంద్రం నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీనిపై ఆసక్తి ఉన్న ప్రైవేట్ సంస్థల నుంచి దరఖాస్తులు కూడా ఆహ్వానిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. అయితే ఈ నిర్ణయాన్ని ఇస్రో ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇస్రోకు సొంతంగా రాకెట్ ప్రయోగాలు నిర్వహించే పూర్తి సామర్థ్యం ఉన్నప్పుడు, ఇంత కీలకమైన ప్రయోగ కేంద్రాన్ని ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి ఎందుకు ఇవ్వాలనే ప్రశ్నను వారు లేవనెత్తుతున్నారు. దాదాపు రెండు వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో కులశేఖరపట్నంలో ఈ రెండో లాంచ్ సెంటర్‌ను కేంద్ర ప్రభుత్వం భారీ వ్యయంతో నిర్మిస్తోంది. నిర్మాణం దాదాపు పూర్తయి, ప్రారంభానికి సిద్ధమవుతున్న ఈ కేంద్రంలో రాకెట్ ప్రయోగాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. అన్ని విధాలుగా ప్రయోగాలకు అనుకూలంగా తీర్చిదిద్దిన ఈ అత్యాధునిక కేంద్రాన్ని ప్రైవేట్ సంస్థలకు నిర్వహణ కోసం అప్పగించాల్సిన అవసరం ఏమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.దేశవ్యాప్తంగా ఉన్న ఇస్రో ఉద్యోగులు ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఏకమవుతున్నారు. కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా శ్రీహరికోటతో పాటు ఢిల్లీలోని వివిధ ఇస్రో కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగ ప్రతినిధులు ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్‌ను కలిసి తమ అభ్యంతరాలను తెలియజేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, కులశేఖరపట్నం లాంచ్ కేంద్రం నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను విరమించుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉన్న ఇస్రో ఉద్యోగులందరూ కలిసి పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగుతామని హెచ్చరిస్తున్నారు. కులశేఖరపట్నం నుంచి ప్రారంభమవుతున్న ఈ ప్రైవేటీకరణ ప్రక్రియ భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఉన్న ఇతర ఇస్రో కేంద్రాల నిర్వహణకు కూడా విస్తరించే ప్రమాదం ఉందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పేర్లు మారుతున్నాయి.. పరిణామాలు కాదు!




హైదరాబాద్,పేదరికాన్ని జయించి కుటుంబానికి అండగా నిలవాలనే ఆశతో పల్లె నుంచి నగరానికి వచ్చిన 21 ఏళ్ల ఉకే శిరీష జీవితం విషాదంగా ముగిసింది. నర్సుగా సేవలందించేందుకు వచ్చిన యువతి తాను నివసిస్తున్న వసతి గదిలోనే దారుణ చర్యకు బలికావడం మహిళల భద్రతపై మరోసారి తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. శిరీష ఘటన మరో విషాదంగా మిగిలిపోకుండా, ప్రతి మహిళకు పని ప్రదేశంలోనూ, నివాసంలోనూ భద్రత కల్పించే వ్యవస్థలపై సమగ్ర సమీక్ష జరగాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది.పోలీసుల దర్యాప్తు వివరాల ప్రకారం, నిందితుడు ఆమె కదలికలను కొంతకాలంగా గమనిస్తూ వచ్చి, నిద్రిస్తున్న సమయంలో కిటికీ గుండా గదిలోకి ప్రవేశించి దారుణానికి ఒడిగట్టాడు. ఆధారాలను బట్టి పోలీసులు వేగంగా స్పందించినప్పటికీ, సమాజం ముందు మిగిలిన ప్రశ్నలు మాత్రం ఇప్పటికీ సమాధానం లేనివే. ఒక ఆడపిల్ల తన ఇంటికి దూరంగా వచ్చి, కష్టపడి పనిచేసే చోట కనీస రక్షణను కోరుకోవడం నేరమా?

తెలంగాణాలోనే నేరాల రేటు ఎక్కువ!

2012లో ఢిల్లీలో నిర్భయ ఘటన దేశాన్ని కుదిపేసింది. ఆ తర్వాత క్రిమినల్ చట్టాల్లో మార్పులు, షీ టీమ్స్, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, సీసీటీవీలు, అత్యవసర హెల్ప్‌లైన్లు అందుబాటులోకి వచ్చాయి. అయినా మహిళలపై నేరాలు ఆగడం లేదు. 2019లో దిశ, 2024లో కోల్‌కతా ఆర్.జి.కర్ ఘటనల తర్వాత ఇప్పుడు శిరీష ఘటన కూడా అదే వరుసలో నిలిచింది. బాధితుల పేర్లు, పనిచేసే ప్రదేశాలు మారుతున్నాయే తప్ప.. నేరాన్ని ముందే పసిగట్టి అడ్డుకోవాల్సిన యంత్రాంగాల వైఫల్యం మాత్రం కొనసాగుతోంది. మన భద్రతా వ్యవస్థలు నేరం జరిగిన తర్వాత కదిలే అంబులెన్స్‌లా కాకుండా.. ప్రమాదాన్ని ముందే గుర్తించి నివారించే రక్షణ వ్యవస్థగా మారాలి. ఎన్‌సీఆర్‌బీ ప్రకారం 2023లో దేశవ్యాప్తంగా మహిళలపై నేరాలకు సంబంధించి 4,48,211 కేసులు నమోదయ్యాయి. 2022లో 4,45,256, 2021లో 4,28,278 కేసులు నమోదయ్యాయి. ప్రతి లక్ష మంది మహిళలకు జాతీయ నేరాల రేటు 66.2 కాగా, తెలంగాణలో ఏకంగా 124.9గా ఉంది. ఇవి నమోదైన కేసులు మాత్రమే. సామాజిక భయం, కుటుంబ ఒత్తిళ్లతో వెలుగులోకి రాని ఘటనలు మరెన్నో ఉండొచ్చు.

రక్షణ లేని ప్రైవేట్ ప్రాంగణాలు..

తెలంగాణలో షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, టీ-సేఫ్ వంటి వ్యవస్థలు పబ్లిక్ ప్రదేశాల్లో ఉపయోగపడుతున్నప్పటికీ, శిరీష ఉదంతం ప్రైవేట్ సంస్థాగత వాతావరణంలో భద్రతపై ప్రశ్నలు లేవనెత్తింది. మహిళా సిబ్బంది నివాస గదులకు పటిష్టమైన తలుపులు, కిటికీలు, సరైన భద్రత ఉండేలా చూడాల్సిన బాధ్యత యాజమాన్యాలదే. మహిళలను ఎవరైనా నిరంతరం గమనిస్తున్నా గుర్తించలేని సాంకేతిక, మానవ నిఘా వ్యవస్థలు లేకపోవడం లోపమే. నేరం జరిగిన తర్వాత మహిళల స్వేచ్ఛపై ఆంక్షలు విధించడం కాకుండా.. రాత్రి, పగలు ఏ వేళలోనైనా పనిచేసే మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, యాజమాన్యాలు తీసుకోవాలి. శిరీష ఘటన మరో విషాదంగా మిగలకూడదంటే చట్టాల అమలు క్షేత్రస్థాయిలో పటిష్టంగా ఉండాలి.

విచారణ పేర కాలయాపన చేయకుండా..

మహిళలు నివసించే హాస్టళ్లు, పీజీలు, పారిశ్రామిక వసతుల్లో 'జెండర్ సేఫ్టీ ఆడిట్' తప్పనిసరి చేయాలి. పని చేసే సీసీటీవీలు, తగిన మౌలిక వసతులు లేని సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. కార్యాలయాల్లో ౹ాఊాం చ ట్టం అమలుపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి. హాట్‌స్పాట్ పెట్రోలింగ్ పెంచడంతో పాటు స్టాకిం గ్ ఫిర్యాదులను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకోవాలి. ఈ దారుణానికి ఒడిగట్టిన ఆ దుర్మార్గుడికి విచారణ పేరిట కాలయాపన చేయకుండా ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా రెండు మూడు నెలల్లో విచారణ చేసి అ త్యంత కఠినమైన, కఠోర శిక్ష విధించాలి. నిందితుడికి పడే కఠిన శిక్ష దెబ్బకు మరే ఆడపిల్లను ఇలాంటి దారుణానికి బలికాకుండా నిరోధించే హెచ్చరికగా నిలవాలి. అలా గే బాల్యం నుంచే అబ్బాయిలకు ఇతరుల ఇష్టాయిష్టాలను, వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించే సంస్కృతిని నేర్పించాలి.

నిజమైన న్యాయం జరగాలంటే..?

మన మధ్య నుంచి దూరమైన శిరీష గానీ, నిర్భయ గానీ, దిశ గానీ మళ్లీ తిరిగి రారు. ఒక దుర్మార్గం జరిగినప్పుడు ఆగ్రహించడం, కొవ్వొత్తులు వెలిగించడం, ఆ తర్వాత మళ్లీ పాత రోజుల్లోకి వెళ్లిపోవడం అనవసరమైన విషవలయం. మహిళల భద్రత అనేది యంత్రాంగాలు అందించే ఉచిత సౌకర్యం కాదు.. అది రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కు. ఆడపిల్ల ఉద్యోగానికి వెళ్లేటప్పుడు కుటుంబ సభ్యులు భయపడే వాతావరణం పోయి, ఈ వ్యవస్థ నన్ను ప్రతి క్షణం కాపాడుతుందనే నమ్మకం కలిగినప్పుడే నిజమైన న్యాయం జరుగుతుంది. శిరీష కేసులో నిందితుడికి పడే శిక్ష ఒక హెచ్చరికగా మారాలి, అదే సమయంలో మరో ఆడపిల్ల ఇలాంటి ఘోరానికి బలికాకుండా నిరోధించడమే మనం ఇవ్వగలిగే అసలైన న్యాయం.

# రాజకీయ సమాధి కట్టుకున్న మాగుంట!



అమరావతి,నోరు మంచిదైతే, ఊరు మంచిదవుతుందని అంటారు. నోరు అదుపులో లేకపోతే, చాలా కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మరీ ముఖ్యంగా రాజకీయాల్లో ఉన్నోళ్లు, నోరు ఎంతగా అదుపులో పెట్టుకుంటే అంత మంచిది. రాజకీయాల్ని వ్యాపారంగా చూసే నాయకులైతే, చాలా లౌక్యాన్ని ప్రదర్శిస్తుంటారు.రాజకీయాల్లో మోతాదుకు మించి లౌక్యాన్ని ప్రదర్శించే వారిలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి అగ్రగణ్యుడు. అయితే ఆయన బుర్రలో ఏం పాడుబుద్ధి పుట్టిందో కానీ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై తీవ్ర అనుచిత వ్యాఖ్యలు చేశారు. తద్వారా తన రాజకీయ జీవితానికి తానే సమాధి కట్టుకున్నారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.వైఎస్ జగన్‌పై నోరుజారి, తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వేదికపై వుండగా, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ఆయన తీవ్ర అనుచిత వ్యాఖ్యలు చేశారు.మూర్ఖుడు వాడు అంటూ జగన్‌పై ఇష్టానుసారం నోరు పారేసుకున్నారు. మాగుంట శ్రీనివాస్‌రెడ్డి ఎప్పుడూ ఇలా మాట్లాడిన దాఖలాలు లేవు. అందుకే అందరిలో ఆశ్చర్యం. మన కులపోడని జగన్‌కు ఓట్లు వేశారంటూ ఆయన ఏదేదో మాట్లాడారు. అసలు మాగుంట బలమే రెడ్డి సామాజిక వర్గం. అలాంటిది వైఎస్ జగన్‌ను ఉద్దేశించి వాడు, మూర్ఖుడు లాంటి అనుచిత వ్యాఖ్యలతో ముఖ్యంగా రెడ్లు, అలాగే వైఎస్సార్ కుటుంబాన్ని అభిమానించే ప్రతి ఒక్కరూ మాగుంటపై రగిలిపోతున్నారు. సీఎం ఎదురుగా వుంటే, ఒళ్లు తెలియకుండా జగన్‌పై అంతేసి మాటలు మాట్లాడుతారా? అంటూ నిలదీస్తున్నారు. 2014లో ఒంగోలు పార్లమెంట్ నుంచి మాగుంట టీడీపీ తరుపన పోటీ చేసి ఓడిపోయారు. 2019లో వైసీపీలో చేరి ఎంపీగా గెలుపొందారు. ఆ సమయంలో సిట్టింగ్ ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని కాదని మాగుంటకు జగన్ సీటు ఇచ్చి, గెలిపించుకున్నారు. ఆ విశ్వాసం కూడా లేకుండా, జగన్‌పై నోటికొచ్చినట్టు మాట్లాడ్డం ఏంటని మాగుంటను తీవ్రస్థాయిలో నిలదీస్తున్నారు.మాగుంట వృత్తిరీత్యా వ్యాపారి, కాంట్రాక్టర్. నిత్యం ప్రభుత్వ పెద్దల ప్రాపకం కోసం వారు అర్రులు చాస్తుంటారు. అందుకే రాజకీయంగా ఎప్పుడూ ప్రత్యర్థులపై చిన్న విమర్శ చేయడానికి కూడా సాహసించరు. వైసీపీ ఎంపీగా చంద్రబాబు, ఆయన పార్టీ నేతల తప్పుల్ని ఎత్తి చూపాలని మాగుంటను ఆ పార్టీ పెద్దలు ఆదేశించారు. అయితే తమ కుటుంబానికి అలాంటి అలవాటు లేదని అప్పట్లో తప్పించుకున్నారు. సీఎం చంద్రబాబుపై రాజకీయ విమర్శలు చేయమన్నారంటూ, అందుకే పార్టీ నుంచి బయటికొచ్చానని మాగుంట ప్రకటించుకున్నారు.మరిప్పుడు, నాటి పెద్దరికం, హుందాతనం ఏమైందనే ప్రశ్నకు మాగుంట వద్ద సమాధానం వుందా? అప్పట్లో చంద్రబాబుపై విమర్శలు చేయమన్నారే తప్ప, ఇప్పట్లో అవాకులు చెవాకులు పేలాలని ఎవరూ ఆదేశించలేదు. మరిప్పుడు జగన్‌పై వాడు, మూర్ఖుడు లాంటి మాటలు ఎలా మాట్లాడారంటూ మాగుంటను విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు.మాగుంట అంటే పెద్ద మనిషి అనే పేరు వుంది. అలాంటి మాగుంటకు ఏం ఇబ్బంది వచ్చిందో, ప్రభుత్వ పెద్దలతో ఎలాంటి అవసరాలు ఏర్పడ్డాయో తెలియదు. ప్రభుత్వ పెద్దల దగ్గర మన్ననలు పొంది, అత్యధిక ప్రయోజనాలు పొందాలనే ఆశతో అవాకులు చెవాకులు పేలారనే చర్చకు తెరలేచింది.ఆ మధ్య చెన్నైలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సోదరుడి తనయుడి వివాహ వేడుకకు మాగుంట వెళ్లారు. జగన్‌తో సన్నిహితంగా మెలగడానికి సంబంధించి వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీంతో వైసీపీలో మాగుంట చేరుతారనే ప్రచారం ఊపందుకుంది. మరీ ముఖ్యంగా క్షేత్రస్థాయిలో మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందనే పాజిటివ్ టాక్ వినిపిస్తున్న నేపథ్యంలో, మాగుంట పార్టీ మార్పు ప్రచారానికి బలం వచ్చింది.బహుశా ఆ ప్రచారం నుంచి బయట పడేందుకు, చంద్రబాబు, లోకేశ్ దగ్గర నమ్మకం సంపాదించుకునేందుకు... జగన్‌పై మాగుంట అనుచిత వ్యాఖ్యలు చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇంతకాలం మాగుంట పెద్ద మనిషి అనే ముసుగు తొలగిపోయిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మాగుంటను ఓడించి తీరుతామనే హెచ్చరికలు వైసీపీ నుంచి తీవ్రంగా వస్తున్నాయి.గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిపై మాగుంటకు వచ్చిన మెజార్టీ 50 వేలు మాత్రమే. అసెంబ్లీ ఎన్నికల్లో చాలా మందికి ఈ మెజార్టీ వచ్చిన సంగతి తెలిసిందే. అందుకే ఒంగోలులో ఈ దఫా మాగుంటకు కష్టకాలమే. రాజకీయంగా గెలుపోటములు సహజం. అయితే వ్యక్తిగత దూషణలకు దిగడమే ఇప్పుడు ప్రధాన చర్చ. అందులోనూ మాగుంట లాంటి నాయకుడు అవాకులు చెవాకులు పేలడం గమనార్హం.బహుశా మాగుంటకు నిన్న రాత్రి నుంచి నిద్రలేని రాత్రులు తప్పవేమో! ఒకవేళ మాగుంట ఖర్మ కాలి వైసీపీ అధికారంలోకి వస్తే, మైనింగ్, లిక్కర్ వ్యాపారాల్ని సజావుగా చేసుకునే పరిస్థితి వుంటుందా? అనే ప్రశ్నకు, సమాధానం అందరికంటే ఆయనకే బాగా తెలుసు. నోరు జారి , భవిష్యత్‌లో చెల్లించబోయే భారీ మూల్యం విలువ ఎంతో మాగుంట లెక్కలేసుకోవాల్సి వుంటుంది.ప్రభుత్వ పెద్దల దగ్గర ప్రయోజనాలు ఆశించే మాట్లాడి వుంటే, జగన్‌కు మాగుంట క్షమాపణ చెప్పరు. ఒకవేళ పొరపాటున నోరు జారినట్టు భావిస్తే, క్షమాపణ చెబుతారనే ప్రచారం జరుగుతోంది. మరి మాగుంట మనసులో ఏముందో తెలియాల్సి వుంది. మాగుంట మౌనాన్ని ఆశ్రయిస్తే మాత్రం, భవిష్యత్‌లో భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందనే వైసీపీ హెచ్చరిక ప్రాధాన్యం సంతరించుకుంది.

# నాలుగు నెలల్లోనే రాబడి లోటు ఏకంగా 36,942 కోట్ల

విజయవాడ,కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక స్థితి క్లిష్టంగాఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లోనే రాబడి లోటు ఏకంగా 36,942 కోట్లకు చేరుకుంది. ఇది యేడాది మొత్తానికి బడ్జెట్‌లో అంచనా వేసిన 22,003 కోట్ల కంటే ఎక్కువ. అదే సమయంలో ద్రవ్య లోటు 49,134 కోట్లకు చేరింది. ఇది వార్షిక అంచనాలో 64 శాతం. నికర రుణాలు కూడా సరిగ్గా అంతే మొత్తంలో ఉండటం రాష్ట్ర రుణ భారాన్ని స్పష్టం చేస్తోంది.ఈ గణాంకాలను ఆర్థిక వ్యవస్థ కోణంలో చూస్తే రాబడి లోటు 168% పెరగడం అంటే రాష్ట్రానికి వచ్చే రోజూవారీ ఆదాయం కన్నా నిత్యం చేసే ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని అర్థం. పన్నులు, పన్నేతర మార్గాల ద్వారా వచ్చే స్వీయ ఆదాయం సరిపోకపోవడంతో ప్రభుత్వ నిర్వహణకే పెద్ద ఎత్తున నిధులు కొరవడుతున్నాయి. ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే, ఆంధ్రప్రదేశ్ అత్యధిక రుణాలు , అత్యధిక రాబడి లోటుతో మొదటి వరుసలో నిలుస్తోంది.ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఇంత క్లిష్టంగా మారడానికి ప్రధాన కారణం జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు , సంక్షేమ పథకాల ఉచితాల వ్యయం విపరీతంగా పెరిగిపోవడమే. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో సింహభాగం ఈ రోజువారీ నిబద్ధతలకే సరిపోతోంది. మరోవైపు, ఆదాయ మార్గాలను పెంచుకోవడంలోనూ, సంపద సృష్టించే మూలధన వ్యయం సాధించడంలోనూ ఆశించినంత వేగం కనిపించడం లేదు. బడ్జెట్ అంచనాలకు, వాస్తవ రాబడులకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసమే ఈ పరిణామానికి దారితీసింది.ఈ తరహా లోటు నిరంతరం పెరిగిపోతే రాష్ట్ర భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. సంక్షేమ పథకాలు లేదా రోజువారీ నిర్వహణ ఖర్చుల కోసం తెచ్చిన అప్పుల వల్ల మూలధన సృష్టి

# విజయసాయిరెడ్డి సస్పెన్స్

విజయవాడ, విజయసాయిరెడ్డి.. దసరా దాకా సస్పెన్స్ థ్రిల్లర్.. అప్పుడే రిలీజ్..చెప్పిన సమయానికి.. అనుకున్న వేదిక వద్దకు విజయసాయిరెడ్డి వచ్చారు. కొద్దిరోజులుగా ఆయన సోషల్ మీడియాలో పెడుతున్న పోస్టులకు తగ్గట్టుగానే.. సుదీర్ఘంగా మాట్లాడారు. వచ్చిన విలేకరులకు తాగడానికి అల్లం టీ.. స్నాక్స్.. మంచి భోజనం పెట్టారు. కానీ.. తన స్క్రిప్ట్ ప్రకారం సస్పెన్స్ థ్రిల్లర్ కొనసాగించారు.సుదీర్ఘంగా మాట్లాడిన విజయసాయిరెడ్డి పార్టీ గురించి ఎటువంటి ప్రకటన చేయలేదు. కాకపోతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఇప్పటివరకు రెడ్లు.. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు మాత్రమే పరిపాలించారని చెప్పారు. అంతేకాదు, తాను ఏర్పాటు చేయబోయే రాజకీయ పార్టీలో సింహభాగం స్థానాలు జన్ జెడ్ కు కేటాయిస్తామని చెప్పారు. అక్కడితోనే ఆగిపోలేదు.. దసరాకు తాను ఏర్పాటు చేయబోయే పార్టీ గురించి ప్రకటిస్తానని విజయసాయిరెడ్డి వెల్లడించారు. అంతేకాదు.. తాను ఏర్పాటు చేయబోయే పార్టీ అధికారంలోకి గనుక వస్తే.. తాను ముఖ్యమంత్రి పదవి తీసుకోనని.. మహారాష్ట్రలో శివసేన అధినేత బాల్ థాక్రే మాదిరిగా పాత్ర పోషిస్తానని చెప్పుకొచ్చారు. విజయసాయిరెడ్డి జగన్ నుంచి దూరం జరిగిన తర్వాత ప్రజాస్వామ్య యుతంగా మాట్లాడుతున్నారు. గడిచిన ఏడాదికాలంగా ఆయన పరిశోధన చేశారట. కాపు కులం నుంచి రెడ్లు ఏ విధంగా వేరుపడ్డారు.. దానికి దారి తీసిన పరిస్థితుల గురించి ఒక పుస్తకాన్ని రాశారట. ఏపీ రాష్ట్రాన్ని ఇప్పటివరకు రెడ్లు.. కమ్మ సామాజిక వర్గాలకు చెందిన వారు మాత్రమే పరిపాలించారని.. మిగతా సామాజిక వర్గాలు ఎందుకు పరిపాలించకూడదని ప్రశ్నించడం విజయసాయిరెడ్డి.. కేవలం రెడ్ల గురించి మాత్రమే పరిశోధన చేయడమేంటి.. పుస్తకం రాయడం ఏంటి.. పైగా పార్టీని ఏర్పాటు చేయబోతున్న ఈ సమయంలో దాని ప్రస్తావన ఎందుకుఆంధ్ర రాష్ట్రానికి దాదాపు 1500 టీఎంసీల నీళ్లు అవసరమని.. ప్రస్తుతం 1100 టిఎంసిల నీళ్లు మాత్రమే ఉన్నాయని విజయసాయిరెడ్డి చెప్పారు. ఆయన ఆవేదనలో అర్థం ఉంది. కానీ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెంబర్ 2 స్థానంలో ఉన్న విజయసాయిరెడ్డి ఏం చేశారు.. అప్పట్లో పార్టీని సజ్జల రామకృష్ణారెడ్డి హైజాక్ చేయలేదు కదా. అప్పుడు విజయసాయిరెడ్డి ఎంత చెబితే జగన్ కు అంత కదా.. అప్పుడు విజ యసాయి రెడ్డి ఏం చేశారు.. ఇప్పుడు ప్రాధాన్యం తగ్గింది.. అందువల్లే ఏపీ ప్రయోజనాలు విజయ సాయి రెడ్డికి గుర్తుకు వచ్చాయి. దసరా దాకా పార్టీ ఏర్పాటును విజయసాయిరెడ్డి సస్పెన్స్ లో పెట్టారు.. కానీ ఇప్పటికీ ఏపీలో పరిస్థితి టిడిపి కూటమి వర్సెస్ వైఎస్ఆర్సిపి అన్నట్టుగానే ఉంది. అప్పట్లో షర్మిల పార్టీ పెట్టినప్పటికీ పెద్దగా సత్తా చూపించిన దాఖలాలు లేవు. విజయసాయిరెడ్డి చెప్పినట్టుగా వచ్చే ఎన్నికల్లో రాజకీయ శూన్యత.. రాజకీయ అనివార్యత ఏపీ రాష్ట్ర రాజకీయాలలో కనిపిస్తుంది అంటే.. నమ్మశక్యంగా లేదు.

# సులోచన కోసం గాలింపు

తిరుపతి,ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలో 'లేడీ డాన్'గా పేరుపొందిన కోనేటి సులోచన నివాసంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కోట్ల రూపాయల విలువైన భూదందాలు, బెదిరింపులకు పాల్పడుతోందన్న ఆరోపణలతో పోలీసులు ఆమె ఇల్లు, ఆమె సోదరుడు శ్రీనివాసులు ఇంటిపై ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఈ దాడుల సమయంలో సులోచన ఇంట్లో లేరని, ఆమె విజయవాడలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మదనపల్లె డీఎస్పీ బుచ్చిరాజు నేతృత్వంలో మూడు పోలీసు బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. మార్పు వెంకటేశ్ నాయుడు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు, కోర్టు నుంచి పొందిన వారెంట్ ఆధారంగా ఈ దాడులు నిర్వహించారు. సులోచన ఇంటి నుంచి సుమారు 50 కీలక డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాలు ఉన్నాయని భావిస్తున్న 15 బాండ్ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఇవ్వకుండా ఈ దాడులను ఆకస్మికంగా నిర్వహించినట్లు పోలీసులు వివరించారు. స్వాధీనం చేసుకున్న పత్రాలను ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం పంపించారు.ఒకప్పుడు వ్యవసాయ కూలీగా ఒకే గది ఇంట్లో నివసించిన సులోచన, అనతికాలంలోనే కోట్లకు పడగెత్తినట్లు స్థానికులు చెబుతున్నారు. కొందరు రాజకీయ నాయకులు, పోలీసు అధికారుల అండదండలతో ఆమె అక్రమాలకు పాల్పడిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగులో భారీ ల్యాండ్ మాఫియా నడుపుతున్నట్లు ఆమెపై ప్రధాన ఆరోపణ. అవసరమైన వారికి అప్పులు ఇచ్చి, ఆ తర్వాత బెదిరింపులు, దౌర్జన్యాలతో వారి భూములను అన్యాయంగా రాయించుకుంటోందని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ఆమె ఇంటి వద్ద బౌన్సర్లను కాపలాగా ఉంచి, బాధితులను భయభ్రాంతులకు గురిచేస్తోందని చెబుతున్నారు.పోలీసు రికార్డుల ప్రకారం, సులోచనపై ఇప్పటికే మదనపల్లె వన్ టౌన్, టూ టౌన్, తాలూకా పోలీస్ స్టేషన్లలో కలిపి 14 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆమెపై రౌడీ షీట్ కూడా తెరిచారు. పోలీసుల దాడుల తర్వాత మరింత మంది బాధితులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తున్నట్లు సమాచారం. బండిమీదకమ్మలపల్లెలో ఒక భవనం, 502 గజాల స్థలం (వీటి విలువ సుమారు రూ.60 కోట్లు), పొన్నుటిపాళ్యంలో 1.75 ఎకరాల భూమి ఆమె పేరు మీద ఉన్నట్లు రికార్డులు చూపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 'లేడీ డాన్‌లు'గా పేరుపొందిన నిడిగుంట అరుణ, అరవ కామాక్షి తరహాలోనే సులోచన కూడా నేర సామ్రాజ్యాన్ని విస్తరించిందని స్థానికులు పోల్చుతున్నారు. కాగా, ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత ఫోర్జరీ ఆరోపణలపై మరింత స్పష్టత వస్తుందని పోలీసులు భావిస్తున్నారు.

# టాక్సికి ఊహించిన దెబ్బ

హైదరాబాద్,కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా, గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో వచ్చిన పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. 'కేజీఎఫ్ 2' లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత యశ్ నటించిన సినిమా కావడంతో దీనిపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, థియేటర్లలో ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. ఈ ప్రభావం ఇప్పుడు సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులపై తీవ్రంగా పడినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. విడుదలకు ముందు కోట్లు కుమ్మరించేందుకు సిద్ధపడిన ఓటీటీ సంస్థలు, ఇప్పుడు ముఖం చాటేస్తున్నాయని సమాచారం.విడుదలకు ముందు 'టాక్సిక్' సినిమాకున్న హైప్‌ను క్యాష్ చేసుకునేందుకు ఓ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ డిజిటల్ హక్కుల కోసం ఏకంగా రూ.150 కోట్లు ఆఫర్ చేసినట్లు ప్రచారం జరిగింది. యశ్ క్రేజ్, సినిమాలో స్టార్ హీరోయిన్లు, బోల్డ్ కంటెంట్‌తో కూడిన టీజర్ వంటి అంశాలు ఈ భారీ ఆఫర్‌కు కారణంగా నిలిచాయి. అయితే, థియేటర్లలో సినిమా బ్లాక్‌బస్టర్ అయితే డిజిటల్ రైట్స్ విలువ రూ.200 కోట్లకు పైగా పలుకుతుందని భావించిన నిర్మాతలు ఆ ఆఫర్‌ను తిరస్కరించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.కానీ, బాక్సాఫీస్ వద్ద సినిమా ఫలితం తారుమారు కావడంతో ఇప్పుడు ఓటీటీ లెక్కలు పూర్తిగా మారిపోయాయి. తాజా సమాచారం ప్రకారం ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 ఈ సినిమా డిజిటల్ హక్కుల కోసం కేవలం రూ.30 కోట్లు మాత్రమే ఆఫర్ చేసినట్లు ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తోంది. విడుదలకు ముందు వచ్చిన ఆఫర్‌తో పోలిస్తే ఇది దాదాపు ఐదో వంతు మాత్రమే. సినిమా ఫలితం ఓటీటీ మార్కెట్‌ను ఎంతలా ప్రభావితం చేస్తుందో చెప్పడానికి ఇదే నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ రూ.150 కోట్ల ఆఫర్, ప్రస్తుత రూ.30

# ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఏపీ వక్ఫ్ బోర్డు.. సరికొత్త రికార్డు

అమరావతి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు విద్యా, నైపుణ్య రంగాలలో చేపట్టిన సరికొత్త కార్యక్రమం అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. విద్యార్థులకు ఉపాధి మరియు వృత్తి నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ వినూత్న ప్రయత్నం 'ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం దక్కించుకుంది. తద్వారా వక్ఫ్ బోర్డు అధికారికంగా రికార్డ్ హోల్డర్‌గా నిలిచి దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది.

చైర్మన్ అబ్దుల్ అజీజ్ హర్షం.. వివరాల వెల్లడి

ఈ అరుదైన మరియు చారిత్రక గౌరవంపై ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సంతోషం వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో ఈ రికార్డుకు సంబంధించిన పూర్తి వివరాలను ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వారి కాళ్లపై వారు నిలబడేలా ఉపాధి నైపుణ్యాలను అందించడంలో బోర్డు సాధించిన ఘనతను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

ప్రత్యేక ఆకర్షణగా 'తాలీమ్-ఎ-హునర్' కార్యక్రమం

ఈ విజయానికి ప్రధాన కారణమైన 'తాలీమ్-ఎ-హునర్' కార్యక్రమం విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడంలో అత్యంత కీలక పాత్ర పోషించింది. ఆధునిక అవసరాలకు తగినట్లుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఈ ప్రాజెక్ట్ కింద ప్రత్యేక శిక్షణలను అందించారు. కేవలం సాంప్రదాయ విద్యకే పరిమితం కాకుండా, విద్యార్థులకు భవిష్యత్తులో ఉపయోగపడే వివిధ టెక్నికల్




మరియు వృత్తిగత నైపుణ్యాలను నేర్పించడంలో ఈ వేదిక విజయవంతమైంది.

భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు

అంతర్జాతీయ స్థాయిలో దక్కిన ఈ గుర్తింపు వక్ఫ్ బోర్డు బాధ్యతను మరింత పెంచిందని చైర్మన్ పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థుల సంక్షేమం కోసం, వారి ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడం కోసం మరిన్ని వినూత్న కార్యక్రమాలను చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ రికార్డు సాధనలో శ్రమించిన బోర్డు అధికారులు, సిబ్బంది మరియు విద్యార్థులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# ఈ ట్రంప్ వద్దు.. ఆయన చేసే కంపు వద్దు.. జనాలు డిసైడ్ అయిపోయారు

న్యూఢిల్లీ,రెండోసారి గద్దెనెక్కిన డొనాల్డ్ ట్రంప్ తాత తన మార్కు నిర్ణయాలతో అమెరికన్ల ఫ్యూజులు ఎగరదీస్తున్నారు. "మళ్లీ అధ్యక్షుడినైతే ప్రపంచంలో శాంతి దూతగా వెలిగిపోతా.. దేశాన్ని స్వర్గం చేస్తా" అని హామీలిచ్చారు. కట్ చేస్తే ఇప్పుడు అమెరికా ఓటర్లు "బాబోయ్.. ఈ నయా ట్రంపిజం మాకొద్దురా నాయనా" అని గుండెలు బాదుకునే పరిస్థితి వచ్చింది. రాబోయే మధ్యంతర ఎన్నికలు రిపబ్లికన్లకు పెద్ద పరీక్షగా మారగా ఓటర్ల మూడ్ చూస్తే ట్రంప్‌కి 'రిటర్న్ గిఫ్ట్' ఇచ్చేలా ఉన్నారు.

ఓటర్ల మూడ్ మారుతోందా?

అమెరికాలో మధ్యంతర ఎన్నికలు అధ్యక్షుడి పాలనకు ఒకరకంగా ప్రజాభిప్రాయ పరీక్షగా నిలుస్తాయి. అధ్యక్షుడి పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ఓటర్లు ఇచ్చే తీర్పు.. తదుపరి రెండేళ్ల రాజకీయ పరిస్థితులను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. ఇదే సమయంలో ట్రంప్‌కు సంబంధించిన ప్రజాభిప్రాయ అంచనాలు రిపబ్లికన్లలో ఆందోళన పెంచుతున్నాయి. ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థ, జీవన వ్యయం, ఉద్యోగాలు, విదేశాంగ విధానం వంటి అంశాలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. అంటే.. ఎన్నికలు కేవలం డెమొక్రాట్లు వర్సెస్ రిపబ్లికన్ల పోరుగా కాకుండా.. 'ట్రంప్ పాలనకు ఓటర్ల మార్కులు ఎన్ని?' అనే అంశంగా మారుతున్నాయన్నమాట.

జేబులు గుల్ల చేస్తున్న 'అమెరికా ఫస్ట్' సర్కస్

'అమెరికా ఫస్ట్' అంటూ స్థానిక పరిశ్రమలను కాపాడటానికి ట్రంప్ గారు దిగుమతులపై సుంకాల బాదుడు మొదలుపెట్టారు. దెబ్బకి విదేశీ వస్తువులతో పాటు దేశీయ వస్తువుల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. "దిగుమతులపై పన్నులు పెంచితే ఆ భారం చివరకు మా జేబులకేగా పడేది తాతా" అని సామాన్య అమెరికన్లు లబోదిబోమంటున్నారు. దేశభక్తి మాట ఎలా ఉన్నా పొద్దున్నే కాఫీ నుంచి సాయంత్రం గ్రాసరీ వరకు ప్రతిచోటా బిల్లు చూసి జనాలు బిక్కమొహమేస్తున్నారు.

మధ్యంతర ఎన్నికల్లో అసలు పోటీ ఇక్కడే!

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడి పేరు నేరుగా బ్యాలెట్‌పై ఉండకపోయినా.. అధ్యక్షుడి పనితీరు మాత్రం ఓటర్ల నిర్ణయంపై ప్రభావం చూపుతుంది. రిపబ్లికన్ అభ్యర్థులకు ఓటు వేయడం అంటే ట్రంప్ విధానాలకు మద్దతు ఇవ్వడంగానే కొంతమంది ఓటర్లు భావించే పరిస్థితి ఏర్పడితే.. అది అధికార పార్టీకి సమస్యగా మారవచ్చు. మరోవైపు డెమొక్రాట్లు కూడా ఇదే అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. 'ట్రంప్‌కు చెక్ పెట్టాలి' అనే ప్రచారాన్ని బలంగా తీసుకెళ్లే అవకాశం ఉంది.

ప్రపంచ శాంతి.. అమెరికన్లకు గుండెకోత




ప్రపంచ యుద్ధాలను ఆపేస్తానని ప్రచారం చేసుకున్న ట్రంప్.. తీరా పీఠం ఎక్కాక మధ్యప్రాచ్యంలో జరుగుతున్న రచ్చను ఆపలేక చేతులెత్తేశారు. "మా పన్నుల డబ్బులు పట్టుకెళ్లి పక్క దేశాల ఘర్షణలకు తగలేయడం ఏంటి? ముందు మా ఇంట్లో తలనొప్పులు తీర్చండి" అని అమెరికన్లు నిలదీస్తున్నారు. 'సూపర్ పవర్' బిల్డప్ పక్కనబెట్టి ముందు మన బ్రతుకులు చూడండని ఓటర్లు గట్టిగానే సౌండ్ చేస్తున్నారు.

యూత్ డిస్‌కనెక్ట్.. నినాదాలు వద్దు.. ఉద్యోగాలు ముద్దు..

ఒకప్పుడు ట్రంప్‌ను 'సిస్టమ్‌ను మార్చే విప్లవ వీరుడు'గా చూసిన కుర్రకారు ఇప్పుడు రూటు మార్చారు. గ్రాడ్యుయేషన్ పూర్తి కాగానే చేతిలో భారీ రుణాలు, చేతికి చిక్కని ఉద్యోగాలు, సొంతిల్లు కొనాలంటే చుక్కలు కనిపిస్తుంటే.. యూత్‌కి ట్రంప్ పైత్యం మీద విరక్తి పుడుతోంది. సోషల్ మీడియా డైలాగులు కడుపు నింపవని గ్రహించిన కుర్రాళ్ళు ఇప్పుడు ట్రంప్‌కి ఓటుతో బుద్ధి చెప్పేందుకు రెడీ అవుతున్నారు.మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ బొమ్మ నేరుగా బ్యాలెట్ మీద ఉండకపోవచ్చు.. కానీ ఈసారి పడబోయేది ఆయన మార్కు పాలనకే మార్కులు.. డెమొక్రాట్లు ఈ అసంతృప్తిని క్యాష్ చేసుకునేందుకు కాచుకుని కూర్చున్నారు. మరి ట్రంప్ మావ తన పాత మ్యాజిక్ రిపీట్ చేసి గట్టెక్కుతారా? లేక 'హస్తం' గాలిలో కొట్టుకుపోతారా? అనేది కాలమే చెప్పాలి.అందుకే ఇప్పుడు ట్రంప్ ముందున్న అసలు సవాలు.. ప్రత్యర్థులను ఓడించడం మాత్రమే కాదు. తనపై అసంతృప్తిగా మారుతున్న ఓటర్లను మళ్లీ తనవైపు తిప్పుకోవడం... మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఇదే ప్రశ్న మరింత కీలకంగా మారనుంది. 'ట్రంప్ మాకొద్దు' అనే అసంతృప్తి నిజంగా ఓటుగా మారుతుందా? లేక ఎన్నికల నాటికి ట్రంప్ మళ్లీ తన రాజకీయ మ్యాజిక్‌తో పరిస్థితిని మార్చేస్తారా? అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు దీనికి సమాధానం చెప్పనున్నాయి.

# మేం ఆదేశించినా నోటీసులా?: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ,దేశంలోని పాఠశాల విద్యార్థులకు తమిళనాడులోని ప్రఖ్యాత ఐఐటీ మద్రాసు శుభవార్త చెప్పింది. 17 అధునాతన కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనుంది. ఎనిమిది వారాల పాటు నిర్వహించే ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల కోసం తాజాగా దరఖాస్తులను ఆహ్వానించింది. ఒక్కో కోర్సుకు రూ.500 నామమాత్రపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. వీటిలో కీలకమైన డైటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి కోర్సులున్నాయి. ఐఐటీ-మద్రాసుకు భాగస్వామిగా నమోదు చేసుకున్న పాఠశాలల్లో 9 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ ఉపాధ్యాయులను సంప్రదించి ఈ కోర్సుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.వచ్చే అక్టోబర్ నుంచి ఈ కోర్సులు ప్రారంభం కానున్నాయి.

# అన్నా, ఎంజీఆర్,ఎన్టీఆర్ సరసన విజయ్.. కానీ అసలు సవాల్ ఇదే..!

చెన్నై:తమిళనాడు రాజకీయాల్లో తాజా పరిణామాలు ముఖ్యమంత్రి దళపతి విజయ్ కి అగ్ని పరీక్షగా మారుతున్నాయా? అనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. పార్టీని స్థాపించిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన విజయ్ ఇప్పుడు ఆ సీటును కాపాడుకోవడంపై ఎక్కువ దృష్టి పెట్టాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. గత ఎన్నికల్లో తాను సాధించిన విజయాన్ని ప్రస్తావిస్తూ ఇటీవల తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి విజయ్ గొప్పగా మాట్లాడారు. 1967, 1977, 1982, 2026 అంటూ గతంలో తమిళనాడు, ఏపీలో జరిగిన ఎన్నికలను గుర్తు చేస్తూ ముఖ్యమంత్రి విజయ్ తనస్థాయి మాజీ ముఖ్యమంత్రులు అన్నా, ఎంజీఆర్, ఎన్టీఆర్ తో సమానం అన్నట్లు మాట్లాడారు. ఆ ముగ్గురు నాయకుల మాదిరిగా పోటీ చేసిన తొలి ఎన్నికల్లో విజయ్ తన పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగారు. అయితే ఆ ముగ్గురికి విజయ్ కి మధ్య చిన్న తేడా కూడా ఉందని, ఈ విషయాన్ని సీఎం విజయ్ మరచిపోతే పరిణామాలు ఇబ్బందికరంగా మారవచ్చని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.అన్నా, ఎంజీఆర్, ఎన్టీఆర్, విజయ్ అంటూ అసెంబ్లీలో సీఎం చేసిన ప్రకటన దేశవ్యాప్తంగా ఆసక్తికర చర్చకు దారితీసింది. తమిళనాడులో అన్నాదురై, ఎంజీఆర్, ఏపీలో ఎన్టీఆర్ ఒక చరిత్రను సృష్టించారు. విజయ్ కూడా ఆ ముగ్గురి మాదిరిగా తనకంటూ ఒక రికార్డు నెలకొల్పారు. అయితే ఆ ముగ్గురు రాజకీయాలు చేసిన కాలానికి ఇప్పటికీ ఎంతో తేడా ఉండటమే కాకుండా మిగిలిన ముగ్గురూ సొంతంగా ప్రభుత్వాలను నడిపారని, విజయ్ మాత్రం సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతున్న విషయాన్ని గుర్తించుకోవాలని పరిశీలకులు సూచిస్తున్నారు. మిత్రపక్షాలను కలుపుకుని వెళ్లడంతోపాటు వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి ప్రభుత్వాన్ని నడపాల్సివుంటుందని అంటున్నారు. గతంలో అన్నా, ఎంజీఆర్, ఎన్టీఆర్ ప్రభుత్వాలను నడిపిన సమయంలో ఇటువంటి ఇబ్బందులు ఎదుర్కోలేదని గుర్తు చేస్తున్నారు.అన్నా, ఎంజీఆర్, ఎన్టీఆర్ తో సమానం అన్నట్లు అసెంబ్లీలో ముఖ్యమంత్రి విజయ్ చేసిన ప్రకటన టీవీకే వర్గాలను విశేషంగా ఆకర్షించింది. దీంతో ఆ ముగ్గురితోపాటు విజయ్ చిత్రాన్ని చేర్చుతూ ప్రత్యేక చిత్రాలను రూపొందిస్తూ తమ అధినేత మనసును మరింత ఉత్తేజ పరిచేలా పనిచేస్తున్నారు. అన్నాదురై, ఎంజీఆర్, ఎన్టీఆర్ వంటి ఉద్ధండుల సరసన తనను తాను నిలుపుకోవడం ముమ్మాటికీ వాస్తవమే అయినప్పటికీ, ఆ మహనీయుల



తరహాలో ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోవడం విజయ్ ముందున్న అసలు సిసలైన సవాల్ అంటున్నారు. గతానికి నేటికీ రాజకీయ పరిస్థితుల్లో చాలా తేడా ఉందని అంటున్నారు. నాటి రాజకీయాల్లో హుందాతనం, విలువలతో కూడిన విమర్శలు ఉండేవని, కానీ, ఇప్పుడు డిజిటల్ యుగంలో రాజకీయం నిత్య రణరంగంగా మారిపోయిందని అంటున్నారు.గతంలో కేవలం సైద్ధాంతిక వైరుధ్యాలకే రాజకీయం పరిమితం అయ్యేది. కానీ, ఇప్పుడు రాజకీయ వైరం కాస్తా వ్యక్తిగత శత్రుత్వంగా రూపాంతరం చెందుతోంది. వ్యక్తిగత అంశాలు కూడా ప్రధాన రాజకీయ అజెండాగా మారిపోతున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. అదేవిధంగా ఒకప్పుడు అభివృద్ధి, సంక్షేమం అనేవి ప్రజల అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుకునేవి. కానీ ప్రస్తుత కాలంలో రాజకీయంగా నిలదొక్కుకోవడానికి, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి భారీగా నిధులు వెచ్చించాల్సి వస్తోంది. తొలి ఎన్నికల్లో పెద్దగా డబ్బు ప్రభావం లేకుండానే సోషల్ మీడియాను సమర్థవంతంగా వాడుకుని విజయ్ విజయం సాధించగలిగారు. అయితే, ఎన్నికల్లో గెలవడం వేరు, ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపించడం వేరని అంటున్నారు. అన్నాదురై, ఎంజీఆర్, ఎన్టీఆర్ సమయంలో ఇటువంటి ఇబ్బందులు లేవని అంటున్నారు. ప్రస్తుతం మిత్రపక్షాలను సమన్వయం చేసుకోవడంతోపాటు అభివృద్ధి, సంక్షేమానికి భారీగా నిధులు సమకూర్చుకోవాల్సివుంటుందని, అప్పుడే మిగిలిన ముగ్గురు మాదిరిగా విజయ్ చరిత్రలో చిరస్థాయిగా చెరిగిపోని ఖ్యాతి పొందే అవకాశం ఉంటుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# వివక్ష,అసమానతలు, పేదరిక నిర్మూలన కోసం పోరాటం




హనుమకొండ,దేశంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న కుల, వర్గ, మత, లింగ వివక్షలను నిర్మూలించడంతో పాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను తొలగించేందుకు భవిష్యత్తులో విస్తృత ఉద్యమాలు చేపడతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు. పేదరిక నిర్మూలనను కూడా ఉద్యమ ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా తీసుకుని పోరాటాలను కొనసాగిస్తామని తెలిపారు. మాకు రాజకీయంగా శాశ్వత మిత్రులు లేరు.. శాశ్వత శత్రువులు లేరని, సమాజ ప్రయోజనాలే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు.హనుమకొండ జిల్లా మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ సదస్సులో మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సభా ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం చిన్న గ్రామంలో ప్రారంభమైన ఉద్యమం దేశాన్ని కదిలించిందన్నారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం వర్గీకరణ సాధించామని, ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో దాని ఫలితాలు అందుతున్నాయని చెప్పారు.ఎస్సీ వర్గీకరణ ఉద్యమంతో పాటు సమాజ ప్రయోజనాల కోసం అనేక అంశాలపై తమ సంస్థ పోరాడిందని మంద కృష్ణ మాదిగ తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కోసం, వికలాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్ల పెంపు కోసం ఉద్యమించి వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేశామని చెప్పారు. ఇకపై కూడా ఎస్సీ వర్గీకరణకే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాల సమస్యలపై విస్తృతంగా పోరాటాలు చేపడతామని వెల్లడించారు.దేశంలో కుల వివక్ష ఇప్పటికీ తీవ్రంగా కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. దళితులు ఉన్నత స్థాయికి ఎదిగినా కుల వివక్ష, అవమానాలకు గురవుతున్నారని అన్నారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడి ఘటనను, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభా ప్రాంగణాన్ని కొందరు శుద్ధి చేశారన్న ఘటనను ఆయన ప్రస్తావించారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి ఇటీవల ఓ ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలు కూడా కుల వివక్షకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలను సహించరాదని, దేశంలో కుల వివక్ష పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు.కుల వ్యవస్థ రద్దు కావాలని, మతపరమైన విద్వేషాలు తొలగిపోవాలని మంద కృష్ణ మాదిగ అన్నారు. లింగ, వర్గ వివక్షలకు ముగింపు పలకడంతో పాటు పేదరికాన్ని నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు తొలగిపోయేలా ఉద్యమాలను నిర్మిస్తామని తెలిపారు. గౌతమ బుద్ధుడు నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వరకు మహనీయులు కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ లక్ష్యాల్లో భాగంగా అక్టోబర్ 7న అమరావతిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన 1,200 మండలాల నూతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కమిటీల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు మంద కృష్ణ మాదిగ ప్రకటించారు. ఈ సదస్సు అనంతరం భవిష్యత్తు కార్యాచరణను రూపొందించి ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు. సమాజంలోని వివక్షలు, అసమానతలు, పేదరికానికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని విస్తరించనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ, ఎంఎస్పీ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ వై.కె. విశ్వనాథ్ మాదిగ, ఎంఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇంజం వెంకటస్వామి మాదిగ, ఎంఎస్పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సొట్ట నరేంద్రబాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోవింద నరేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మద్దులపల్లిలో బీఆర్ఎస్‌లోకి భారీ చేరికలు

మహాదేవపూర్, మద్దులపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొట్టె రవీందర్ మరియు వార్డు మెంబర్ చకినరపు సంతోష్ మరియు రాజక్క, సమ్మక్క తదితర మహిళలు, లాస్మయ్య, కళ్యాణ్, రమేష్, శ్రీధర్, సంతోష్, దేవేందర్, రాజయ్య, ఎర్రయ్య, తిరుపతి సుమారు 100 మంది మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ గారి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ లో చేరారు, ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వారికి కండువాలు కప్పి భిఆర్ఎస్ పార్టీ లోకి ఆహ్వానించారు...ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మద్దులపల్లి గ్రామం నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ నాయకత్వానికి బలం చేకూర్చేందుకు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజలు బీఆర్ఎస్ వైపు వస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయానికి సరిపడా విద్యుత్

# రేవంత్ టార్గెట్ ఎప్పుడూ టాప్‌లోనే – కేసీఆర్ దగ్గరకే కేసు!



హైదరాబాద్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహాలు ఎప్పుడూ టాప్‌లోనే ఉంటాయి. ఈ విషయం మరోసారి రుజువైంది. తెలంగాణ అసెంబ్లీ లోపల, వెలుపల గత రెండు, మూడు రోజులుగా చోటుచేసుకున్న హైడ్రామా, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలు, పోలీసులపై ఎమ్మెల్యేల ప్రతిఘటన వ్యవహారాలు కేవలం కొందరు నేతల అత్యుత్సాహం కాదని.. దీని వెనుక పెద్ద కుట్ర దాగుందని సీఎం రేవంత్ అసెంబ్లీ వేదికగా బాంబు పేల్చారు. ఈ మొత్తం ఉదంతానికి అసలు సూత్రధారి బీఆర్ఎస్ అధినేత కేసీఆరేనని నేరుగా వేలెత్తి చూపడం ద్వారా గులాబీ దళానికి దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు.అసెంబ్లీలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం పూర్తిస్థాయి రాజకీయ, న్యాయపరమైన వ్యూహంతో సాగింది. ఈ నెల 6వ తేదీన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన అంతర్గత భేటీలోనే ఈ మొత్తం వ్యవహారానికి స్క్రిప్ట్ సిద్ధమైందని రేవంత్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ మరుసటి రోజే అసెంబ్లీలో ఉద్దేశపూర్వకంగా ఉద్రిక్తతలు సృష్టించడం, సమాజాన్ని చీల్చేలా రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న దళిత నేతపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడటం, విధుల్లో ఉన్న పోలీసులపై దాడికి దిగడం వెనుక పక్కా ప్లాన్ ఉందన్నారు. కేవలం సభా నిబంధనల ఉల్లంఘనగా కాకుండా, ప్రభుత్వాన్ని, శాంతిభద్రతలను అస్థిరపరిచే నేరపూరిత కుట్ర గా ఈ అంశాన్ని కాంగ్రెస్ సర్కార్ పరిగణిస్తున్నట్లు స్పష్టమైంది.ఈ వ్యవహారాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా ప్రభుత్వం పక్కా కార్యాచరణకు దిగింది. హైదరాబాద్ పోలీస్ జాయింట్ కమిషనర్ విజయ్ కుమార్ నేతృత్వంలో ఈ సమగ్ర కుట్ర కోణంపై ప్రత్యేక విచారణ జరిపిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. ఫామ్‌హౌస్‌లో జరిగిన సమావేశం, అక్కడికి హాజరైన నేతలు, అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలు, అసెంబ్లీ గేట్ వద్ద జరిగిన భౌతిక దాడుల వెనుక ఉన్న లింకులను టెక్నికల్, ఫోరెన్సిక్ సాక్ష్యాల ఆధారంగా వెలికితీయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి పర్యవేక్షణలో నేరపూరిత కుట్ర కోణంలో విచారణ చేపట్టడంతో, ఈ కేసు దర్యాప్తు చివరకు ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ను తాకే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఇప్పటివరకు కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్యేల సస్పెన్షన్, గవర్నర్‌కు ఫిర్యాదుల చుట్టూ తిరిగిన నరేటివ్‌ను.. రేవంత్ ఒక్క దెబ్బతో నేరుగా కేసీఆర్ వర్సెస్ దళిత స్పీకర్ వివాదంగా, వ్యవస్థలపై దాడిగా మార్చేశారు. అటు క్షేత్రస్థాయిలో దళితుల నిరసన ప్రాంతాన్ని పాలతో శుద్ధి చేసిన వివాదం ఇప్పటికే బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టగా, ఇప్పుడు జాయింట్ సీపీ విచారణ ద్వారా కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చే వరకూ వ్యవహారాన్ని లాగితే గులాబీ పార్టీ మరింత ఇరకాటంలో పడటం ఖాయం.

# తెలంగాణ ఉద్యోగుల పీఆర్సీపై కీలక ముందడుగు



హైదరాబాద్,తెలంగాణలో పెండింగ్ కరువు భత్యం వాయిదాలు, రెండవ వేతన సవరణ కమిషన్ (2nd PRC) ఫిట్‌మెంట్ ఖరారుపై ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళనలకు సిద్ధమవుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఉద్యోగ సంఘాల నుంచి పెరుగుతున్న ఒత్తిడి దృష్ట్యా నివేదికను వేగవంతం చేసేందుకు సీఎస్ సంజయ్ చర్యలు చేపట్టారు. రెండవ పీఆర్సీ ఛైర్మన్ శివశంకర్ కు లేఖ రాసిన సీఎస్, తుది నివేదికను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించారు. తెలంగాణ సచివాలయంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన కీలక సమావేశంలో ఈ విషయాలను పంచుకున్నారు. పీఆర్సీ కమిషన్ నివేదిక అందిన వెంటనే ఉద్యోగుల జీతాల పెంపు, ఫిట్‌మెంట్ శాతంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వానికి వీలు కలుగుతుంది.

పెండింగ్ డీఏలు, ఆర్థిక అంశాలపై సచివాలయంలో కీలక చర్చలు

పీఆర్సీ ప్రక్రియతో పాటు ఉద్యోగులను వేధిస్తున్న ఇతర ఆర్థిక సమస్యలపై కూడా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చింది. పెండింగ్‌లో ఉన్న డీఏలు, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్ ముగింపు చెల్లింపులపై సమగ్రంగా చర్చించేందుకు ఈ నెల 18న ఉద్యోగ సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెల్లడించారు. ఈ భేటీలో పెండింగ్ బిల్లుల విడుదల క్యాలెండర్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ సానుకూల వైఖరితో ఉద్యోగ వర్గాల్లో కొంత ఉపశమనం లభించినప్పటికీ, 2వ పీఆర్సీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి ఫిట్‌మెంట్ ప్రకటిస్తుందోనని ఉద్యోగులంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140